



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

PEN POWER TELUGU DAILY

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 | సంచిక : 297 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 2 జూలై 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# కేసీఆర్ సంతకాలే మరణ శాసనం..

## తెలంగాణ జలాల విషయంలో వెనక్కి తగ్గేది లేదు

- ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్
- గత పదేళ్లలో కేసీఆర్, హరీశ్ రావులే రాష్ట్రానికి నష్టం చేశారని ఆరోపణ
- 2015 నాటి ఒప్పందమే తెలంగాణకు మరణశాసనంగా మారిందని తీవ్ర విమర్శ
- రాష్ట్ర నీటి హక్కుల కోసం రాజకీయంగా, న్యాయపరంగా పోరాడతామని వెల్లడి
- ఏపీ ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటుంటే తెలంగాణ ప్రాజెక్టులు పట్టించుకోలేదని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు 2015లో చేసిన సంతకాలే తెలంగాణ నీటి హక్కులకు మరణశాసనంగా మారాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర జలాల విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తే లేదని, తెలంగాణ హక్కుల సాధన కోసం రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల' అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీరుపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పదేళ్ల పాటు నీటిపారుదల శాఖను కేసీఆర్, హరీశ్ రావులే చూశారు. వారే రాష్ట్ర నీటి హక్కులను కాపాడతారని ప్రజలంతా భావించారు. కానీ దురదృష్టవశాత్తు వారి నిర్ణయాల వల్లే తెలంగాణకు తీరని నష్టం జరిగింది" అని ఆయన అన్నారు. కృష్ణా జలాల్లో మొత్తం 811 టీఎంసీలకు గాను తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని, మిగిలిన 68 శాతం నీటిని ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని 2015లో వారే సంతకాలు చేశారని రేవంత్ ఆరోపించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతం ప్రకారం చూస్తే వాస్తవానికి తెలంగాణకే ఎక్కువ నీటి వాటా దక్కాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ప్రాజెక్టులను గత పదేళ్లలో పట్టించుకోకపోవడం వల్లే రాష్ట్రానికి కేటాయించిన 299 టీఎంసీల నీటిని కూడా పూర్తిగా వాడుకోలేని దయనీయ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం తమ ప్రాజెక్టులను పూర్తిచేసుకొని నీటిని తరలించుకుపోతోందని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, నీటి హక్కుల పరిరక్షణలో వెనకడుగు వేసేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

# పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

- పార్టీ అంతర్గత అంశాలపై స్పందించిన కిషన్ రెడ్డి
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు
- రెండు పార్టీలు అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్నాయని ఆరోపణ
- మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని భారాస అప్పుల్లోకి నెట్టిందని విమర్శ
- ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కొత్త అధ్యక్షుడి ఎన్నిక విషయంలో పార్టీ అంతర్గత అంశాలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. బీజేపీలో పదవులు ముఖ్యం కాదని ఆయన అన్నారు. "రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరున్నా ఫర్వాలేదు. మన పార్టీకి కార్యకర్తలే నిజమైన నాయకులు, వాళ్లే మన బలం. నాయకత్వంలో ఎవరున్నా అందరూ ఐక్యంగా పనిచేయాలి" అని స్పష్టం చేశారు. రామచందర్‌రావు నాయకత్వంలో నేతలంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అందరూ సమష్టిగా పని చేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. మంగళవారం హైదరాబాద్ శివార్లలోని మన్నెగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ,

వివరాలు 2లో..

# ఆ రోజు ఏం జరిగిందంటే?

## ఆపరేషన్ సిందూర్-ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ

- భారత్-పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్ వాదనలో నిజం లేదన్న జైశంకర్
- అమెరికా అధ్యక్షుడి ప్రచారాన్ని తోసిపుచ్చిన జైశంకర్
- మే 9న పాక్ దాడి, భారత్ దీటైన జవాబు ఇచ్చిందన్న మంత్రి
- పాకిస్థానే నేరుగా కాల్పుల విరమణకు ముందుకొచ్చిందని వెల్లడి
- పహల్గామ్ దాడిని ఆర్థిక యుద్ధంగా అభివర్ణన
- ఉగ్రవాద నిర్మూలనలో అణు బెదిరింపులకు లొంగబోమని స్పష్టీకరణ

వివరాలు 2లో..



# చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!



- సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో కొత్త విధానం
- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కోటా కేటాయింపు
- జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్

**పెన్ పవర్ డెస్క్:**దేశ అత్యున్నత న్యాయస్థానం భారత సుప్రీంకోర్టు చరిత్రలో ఒక కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు తొలిసారిగా,

వివరాలు 2లో..

# ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత

- సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం
- హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన పట్టాభిరామ్
- ప్రముఖ ఇంద్రజాలికుడిగా, సైకాలజిస్టుగా గుర్తింపు
- వ్యక్తిత్వ వికాస ప్రసంగాలతో తెలుగువారికి సుపరిచితులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, బహుముఖ ప్రజ్ఞాశా లి బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తన మాటలతో లక్షలాది మందిలో స్ఫూర్తి నింపిన పట్టాభిరామ్ ఆకస్మిక మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. బీవీ పట్టాభిరామ్ కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా, పేరుగాంచిన ఇంద్రజాలికుడిగా, మానసిక నిపుణుడిగా కూడా తెలుగు ప్రజలకు సుపరిచితులు. అనేక పుస్తకాలు, టెలివిజన్ కార్యక్రమాలు, వేలాది ప్రసంగాల ద్వారా ఆయన సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేశారు. క్లిష్టమైన మానసిక శాస్త్ర అంశాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా సులభమైన శైలిలో వివరించడం ఆయన ప్రత్యేకత.

# బనకచర్లకు అనుమతుల తిరస్కరణ తెలంగాణ సర్కార్ విజయం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదస్పదంగా మారిన బనకచర్ల ప్రాజెక్ట్‌పై మంగళవారం (జూలై 1) ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

వివరాలు 2లో..



# పాశమైలారం ఫ్యాక్టరీని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

- ఫ్యాక్టరీని గతంలో ఎప్పుడు తనిఖీ చేశారని అధికారులకు ప్రశ్న
- ప్రమాదానికి కారణంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశం
- సీఎంతో పాటు మంత్రులు వివేక్, శ్రీధర్ బాబు, రాజనర్సింహ, పొంగులేటి



**హైదరాబాద్ పెన్ పవర్:**పాశమైలారంలో పేలుడు సంభవించిన సిగాచీ కంపెనీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలిం చారు. ప్రమాదం జరిగిన తీరును, ప్రాణనష్టం ఎక్కువగా ఉండడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంతకుముందు సిగాచీ ఫ్యాక్టరీని ఎప్పుడు తనిఖీ చేశారని అధికారులను ప్రశ్నించారు. ఈ ప్రమాదానికి కచ్చితమైన కారణం కనిపెట్టాలని ఆదేశించారు. నిపుణులతో దర్యాప్తు జరిపించి పేలుడుకు కారణమేంటనే వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

వివరాలు 2లో..

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఇస్తున్నారు

- ఆర్అండ్‌బీ శాఖ పనుల పురోగతిపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- ప్రమోషన్లు ఇచ్చింది ఫలితాలు చూపించడానికేనని వ్యాఖ్య
- నిధుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఇస్తున్నారని వెల్లడి
- ప్రతి సమీక్షకు పనుల పురోగతి నివేదిక తప్పనిసరి అని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:**నిధుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ శాఖకు పూర్తి మద్దతు ఇస్తున్నారని, కాబట్టి నిధుల గురించి ఆలోచించకుండా పనులు వేగంగా పూర్తి చేయాలని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్ కార్యాలయంలో మంగళవారం

వివరాలు 2లో..

# అవును.. నేను అదృష్టవంతుడినే

## లాటరీ తగిలిందన్న వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందన



- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అదృష్టవంతుడంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వ్యాఖ్య
- అవును, అదృష్టం వల్లే ముఖ్యమంత్రిని అయ్యానని బదులిచ్చిన సిద్ధరామయ్య
- ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి జరిగిందంటూ పాటిల్ ఆరోపణలు
- మరికొందరు ఎమ్మెల్యేల నుంచి కూడా ప్రభుత్వ తీరుపై అసంతృప్తి గళం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బ్రేక్ తాత్కాలికమేనా?

బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**గేమ్ ఛేంజర్ గా భావించి...**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలిసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

**రాజకీయంగా అగ్గి రాజుకోవడంతో...**

అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పదే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

**అభ్యంతరాలు వ్యక్తం కావడంతో...**

తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# పార్టీకి కార్యకర్తలే నిజమైన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలి

- మొదటి పేజీ తరువాయి

మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకున్నాయని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఏమీ చేయడం లేదని కొందరు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలన్నీ కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ నిజాన్ని విమర్శకులు గుర్తించాలని ఆయన హితవు పలికారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయం తామేనని, రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి మద్దతు ఇస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

ఆయన ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో రహదారులు, భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. "ప్రమోషన్లు, పోస్టింగుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి అన్నీ పూర్తి చేశాం. ఇప్పుడు మీరంతా ఫలితాలు చూపించాల్సిన సమయం వచ్చింది" అని అధికారులకు స్పష్టం చేశారు. శాఖ పరిధిలోని అన్ని రకాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, ఏమాత్రం జాప్యం తగదని ఆయన తేల్చిచెప్పారు. చీఫ్ ఇంజినీర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పనుల నాణ్యతను స్వయంగా పర్యవేక్షించాలని సూచించారు. ఇకపై జరిగే ప్రతి సమీక్ష సమావేశానికి పనుల్లో ఎంత పురోగతి సాధించారో స్పష్టమైన నివేదికతో హాజరుకావాలని ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, ఇతర ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆసుపత్రులు, నాణ్యమైన రహదారులను సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు. రెండు రోజుల్లో హ్యామ్ (హెచ్ఏఎం) రోడ్ల ప్యాకేజీలపై

ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. రహదారులపై ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్‌లను, వర్టికల్ కర్వ్‌లను ముందుగానే గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

### చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!

- మొదటి పేజీ తరువాయి

తన సిబ్బంది నియామకాలు మరియు పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు రిజర్వేషన్ల విధానాన్ని అధికా రికంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా సుప్రీంకోర్టు ఒక బలమైన ముందడుగు వేసినట్లయింది. ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తూ జూన్ 24న సుప్రీంకోర్టు ఒక అంతర్గత సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, రిజర్వేషన్ల విధానం జూన్ 23, నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. దీని ప్రకారం, కోర్టులో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీ వర్గాలకు 15 శాతం, ఎస్టీ వర్గాలకు 7.5 శాతం కోటా వర్తిస్తుంది. ఈ రిజర్వేషన్ల అమలు కోసం రూపొందించిన 'మోడల్ రిజర్వేషన్ రోస్టర్', సంబంధిత రిజిస్టర్ల వివరాలను కోర్టు అంతర్గత నెట్‌వర్క్ అయిన 'సుప్‌నెట్'లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ రిజర్వేషన్ విధానం సుప్రీంకోర్టులోని రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి పలు స్థాయిల్లోని పోస్టులకు వర్తించనుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. విడుదల చేసిన రిజర్వేషన్ జాబితాలో ఏవైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, సిబ్బంది తమ అభ్యంతరాలను నేరుగా రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి హయాంలో ఈ చారిత్రక నిర్ణయం వెలువడటం గమనార్హం. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన రెండో వ్యక్తిగా జస్టిస్ గవాయి చరిత్ర సృష్టించారు. ఆయన పదవీకాలంలోనే అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పాశమైలారం ఫ్యాక్టరీని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

ఉదయం సీఎం రేవంత్ రెడ్డి పోశమైలారం సిగాచీ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. ఆయనతో పాటు మంత్రులు వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు, పొంగులేటి, దామోదర రాజనర్సింహ తదితరులు వెంట ఉన్నారు. అనంతరం ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించనున్నారు.

# ఆ రోజు ఏం జరిగిందంటే?

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఆ ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ ఒప్పందం వెనుక జరిగిన అసలు వాస్తవాలను ఆయన ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే 'న్యూస్‌వీక్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జైశంకర్ మాట్లాడుతూ, మే 9వ తేదీ రాత్రి జరిగిన పరిణామాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఆ సమయంలో నేను ప్రధానితో పాటే ఉన్నాను. పాకిస్థాన్ నుంచి భారత్‌పై పెద్ద ఎత్తున దాడి జరిగే ప్రమాదం ఉందని వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ పాక్ దుస్సాహసానికి పాల్పడితే అందుకు తగిన రీతిలో, దీటుగా బదులిస్తామని మోదీ ఆయనకు స్పష్టం చేశారు" అని జైశంకర్ తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఘటనలను వివరిస్తూ "అనుకున్నట్టే ఆ రాత్రి పాకిస్థాన్ భారత్‌పై భారీ దాడికి తెగబడింది. అయితే, భారత బలగాలు ఆ దాడులను అత్యంత సమర్థవంతంగా, వేగంగా తిప్పికొట్టాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. కాల్పుల విరమణకు దారితీసిన పరిస్థితులను ఆయన విడమరిచి చెప్పారు.

ఆ మరుసటి రోజు ఉదయం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తనకు ఫోన్ చేసి, పాకిస్థాన్ చర్చలకు సిద్ధంగా ఉందని చెప్పినట్లు జైశంకర్ వెల్లడించారు. అయితే, ఆ తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. "అదే రోజు మధ్యాహ్నం, పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) మేజర్ జనరల్ ఖసిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్‌కు నేరుగా ఫోన్ చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం పాటిద్దామని ప్రతిపాదించారు. అసలు జరిగింది ఇది" అని జైశంకర్ తేల్చిచెప్పారు. వాణిజ్యానికి, కాల్పుల విరమణకు భారత్ పరంగా ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

**పహల్గామ్ దాడి ఆర్థిక యుద్ధమే**

ఇదే ఇంటర్వ్యూలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని జైశంకర్ ఒక 'ఆర్థిక యుద్ధ చర్య'గా అభివర్ణించారు. కశ్మీర్ లోయలో అభివృద్ధిని, శాంతిని ఓర్వలేకే ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని ఆయన అన్నారు. "జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ దాడి చేశారు. మత ఘర్షణలు రెచ్చగొట్టేందుకు, పర్యాటకుల మతం అడిగి మరీ వారిని కాల్చి చంపారు. ఈ ఘటన తర్వాత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మేం నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఉగ్రవాదులకు, వారికి అండగా నిలిచే ప్రభుత్వాలకు భారత్ తగిన బుద్ధి చెబుతుందని, ఉగ్రవాదాన్ని అణిచివేసే క్రమంలో ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

# బనకచర్లకు అనుమతుల తిరస్కరణ తెలంగాణ సర్కార్ విజయం

- మొదటి పేజీ తరువాయి

పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు ఈ పీపీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. బనకచర్ల ప్రాజెక్ట్?తో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని.. అందుకే బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు తిరస్కరించిందన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్?కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్?కు సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వాదనలు పూర్తిగా అవాస్తమని అన్నారు.

కాగా, ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని ఆంధ్రప్రదేశ్?కు తేల్చిచెప్పింది. ఈ మేరకు బనకచర్ల ప్రాజెక్ట్ కోసం ఆంధ్రప్రదేశ్ పంపిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తిప్పిపంపింది. బనకచర్ల ప్రాజెక్ట్?కు అనుమతులు ఇవ్వాలంటే సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించాల్సి ఉందని.. ఈ మేరకు సీడబ్ల్యూసీని అప్రోచ్ కావాలని ఏపీకి సూచించింది. సీడబ్ల్యూసీతో కలిసి ఫ్లడ్ వాటర్ అవేలబులిటి అస్సెస్ చేయాలని పేర్కొంది. అంతరాష్ట్ర జల వివాదానికి క్లియరెన్స్ తెచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్?కు సూచించింది.

# అవును.. నేను అదృష్టవంతుడినే

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలు అధికార పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేవలం అదృష్టం వల్లే ఆ పదవిలో ఉన్నారంటూ ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు, ముఖ్యమంత్రి అంతే ఘాటుగా సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంగళవారం మాట్లాడుతూ, "సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియాగాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సూర్జేవాలాను కలిసి చెప్పాల్సిందంతా చెప్పా. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియో బయటకు రావడంతో రాజకీయ దుమారం రేగింది.

ఈ విమర్శలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనదైన శైలిలో స్పందించారు. "అవును.. నేను అదృష్టవంతుడినే. అందుకే ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నాను" అని బదులిచ్చారు.

**అసలేం జరిగింది?**

తన నియోజకవర్గమైన అలంద్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఇటీవల ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణలను గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఖండించారు. కేటాయింపులన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ వివాదం తర్వాత మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజు కాజె, బేలూర్ గోపాలకృష్ణ కూడా తమ ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కారు.

**రంగంలోకి అధిష్ఠానం**

ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసమ్మతి స్వరాలు వినిపిస్తుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను బెంగళూరుకు పంపింది.

ఆయన అసంతృప్త ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న ఊహాగానాల వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీలు నిలిచిపోవాలనే దురుద్దేశంతోనే బీజేపీ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# అదానీ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలంటున్న ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్

**అనంతగిరి జూలై 1. పెన్ పవర్** అనంతగిరి మండలంలో పెదకోట పంచాయతీలో అదానీ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు కు స్థానిక ఆదివాసీల, పీసా గ్రామసభకు సంప్రదించకుండా ఏకపక్షంగా అనుమతులు ఇస్తూ జీ.ఓ నెంబర్ 51 ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని, దీన్ని తక్షణమే రద్దు చేయాలనీ దీన్నీ ఆదివాసీ గిరిజన సంఘం రద్దు చేయాలంటూ డిమాండ్ చేస్తుందని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం ఆయన విలేకర్ల సమక్షం లో మాట్లాడారు.

జీవోలో పెదకోట ప్రాజెక్టు కెపాసిటీ 1,800 మెగా వాట్స్ కు పెంచడమే కాకుండా, స్థానిక వాగు నుంచి 16.54 ఎంసీఎం నీటిని తరలించడానికి కూడా అనుమతి ఇచ్చిందని పెదకోట ప్రాంతం, రాజ్యాంగం ఐదవ షెడ్యూల్ క్రింద నోటిఫై చేయబడిన ప్రాంతమని,

షెడ్యూల్డ్ ప్రాంతంలో 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం ఆదివాసీలకు ప్రత్యేకమైన హక్కులు ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష అనుమతులు జారీ చేసిందని కేంద్ర ఆదివాసీ హక్కుల పరిరక్షణ చట్టాలు,1/70 చట్టం , పీసా, అటవీ హక్కుల చట్టాలను ఉల్లంఘించడం అవుతుందని ప్రభుత్వం స్థానిక ఆదివాసీ గ్రామసభల ముందస్తు అనుమతి తీసుకోవాలని, ప్రభుత్వం అటువంటి అనుమతి తీసుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 51 (ఎనర్జీ) తేదీ 30-6-2025 చట్టపరంగా చెల్లదని ఆ ప్రాంతంలో ఆదివాసీలు, వారి నీటి అవసరాల కోసం, అక్కడి వాగుల మీద ఆధారపడి జీవిస్తున్నారని అటువంటి వాగుల నుంచి 16.547 ఎం సి ఎం నీటిని ప్రాజెక్టు కోసం తరలించడం వల్ల ఆదివాసులకు అపారమైన హాని, ముఖ్యంగా వారి మానవ హక్కులకు భంగం కలుగుతుందని ముందున్న ప్రభుత్వం, ఎటువంటి కాంపిటీటివ్ బిడ్డింగ్ లేకుండా, ఆ ప్రాజెక్టును అదానీ కంపెనీకి సమర్పించడం ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకించారని సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం అటువంటి నిర్ణయం (ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్) చట్టాన్ని ఆకర్షించగలదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీగా ఉండవలసిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దాసోహం పలకడం దారుణమని గత వైసీపీ ప్రభుత్వం ఆదాని కార్పొరేట్ కంపెనీతో ఒప్పందం చేసుకుందని, నాడు అటువంటి నిర్ణయాలను ప్రజలు ప్రశ్నించారని ఆ నిర్ణయాన్ని ఇప్పుడున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పునపరిశీలించకుండా, అదే అదానీ కంపెనీకి తిరిగి కట్టబెట్టడం దారుణమని, గత వైసీపీ ప్రభుత్వానికి నేటి చంద్రబాబు కూటమి ప్రభుత్వానికి తేడా లేదనీ, అడుగుల్లో మడుగులు ఒత్తుతూ కూటమి పాలన ఉందని ప్రభుత్వం తక్షణం జీవో 51 (ఎనర్జీ) 30-6-2025 ను వెనక్కి తీసుకుని, ప్రాజెక్టును రద్దు చేయాలనీ లేని పక్షంలో ఆదివాసీ ఉద్యమం ఉధృతం చేస్తామని ఆయనన్నారు.



## ఏపీ టూరిజం ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన విరమించు కోవాలంటున్న అనంతగిరి జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు



**అనంత గిరి జూలై 1. పెన్ పవర్** మంగళవారం సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్యా ఆద్వర్యంలో అనంతగిరి హరిత రిషార్ట్ కార్మికులతో కలిసి నిరసన చేశారు ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ టూరిజం రిషార్ట్స్ ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టం ఉల్లంఘించి ఏ విధంగా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తారని వీరు ప్రశ్నించారు. భవిష్యత్తులో కార్మికులు అందరూ కలిసి కట్టుగా పోరాటానికి సిద్ధం కావాలని ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఏపీ టూరిజం ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె లో పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులను వీరు కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియు టూరిజం యూనియన్ నాయకులు దోనేరి విజయకుమార్, సిఐటియు నాయకులు దీసరి బుద్దురాజు, గిరిజన సంఘం నాయకులు పాంగి మద్దు టూరిజం వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రిష్టి స్కూల్లో ఘనంగా డాక్టర్ల దినోత్సవం వేడుకలు



**గాజువాక పెన్ పవర్ జూలై 01:**విశాఖపట్నం, ఉక్కునగరం లోని శ్రిష్టి వరల్డ్ స్కూల్ జూలై 1, 2025న డాక్టర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. డాక్టర్ల సేవలకు గౌరవం అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కృతజ్ఞత భావనను పెంపొందించడంతో పాటు, ఆరోగ్య సంరక్షణ వృత్తిలో డాక్టర్ల పాత్రను గుర్తు చేసింది ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పి. సుశీలా రాణి ఒక ప్రభావవంతమైన సందేశాన్ని అందిస్తూ, సమాజ ఆరోగ్యానికి డాక్టర్ల చేస్తున్న సేవలను గుర్తించి, పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

డాక్టర్గా తన కెరీర్ ను ప్రారంభించి, ప్రస్తుతం కేర్ అండ్ గ్రో సంస్థ సీఈఓగా ఉన్న మేఘన కంభం కి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆమె భారతదేశంలో తొలిసారిగా ఎర్లీ చైల్డ్హుడ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభించిన వ్యక్తి గుర్తింపబడ్డారని అన్నారు.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని, 15 మంది విద్యార్థులు , ఉపాధ్యాయులు కలిసి విశాఖపట్నం జనరల్ హాస్పిటల్ను సందర్శించారు డాక్టర్ల సేవలను గుర్తించి, వారికి కృతజ్ఞత తెలుపడానికి ఇది ఒక విలక్షణమైన అవకాశం అయింది. ఈ సందర్శనలో విద్యార్థులు డాక్టర్లకు తమ అభినందనలు తెలియజేశారు. డాక్టర్లు కూడా పిల్లలకు శారీరక చురుకుదనం పాటించాలని, మొబైల్ వాడకాన్ని తగ్గించాలని ముఖ్యమైన ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

పాఠశాలలో విద్యార్థులు స్వయంగా రూపొందించిన గ్రీటింగ్ కార్డులను ,తమ కుటుంబ డాక్టర్లకు అందజేసి కృతజ్ఞతను తెలిపారు . ఈ కార్యక్రమం విద్యార్థులకు ఆరోగ్య రంగం పట్ల అవగాహన పెంచడమే కాకుండా, సేవా భావం యొక్క విశిష్టతను తెలియజేశారు.

## వార్డు అభివృద్ధి పనులపై పల్లా, జీవీఎంసీ కమిషనర్ వినతి



**గాజువాక పెన్ పవర్, జూలై 01:** గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ . రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తో కలిసి వినతి పత్రం అందజేశారు. జీవీఎంసీ 87 వ వార్డు లో అభివృద్ధికి నోచుకోని వడ్లపూడి బస్ స్టాప్ నుండి గాంధీ బొమ్మ జంక్షన్ వరకు ఫుట్పుటుతో కూడిన ప్రధాన రోడ్డు. ,వడ్లపూడి జంక్షన్ నుండి కూర్మన్నపాలెం జంక్షన్ వరకు ఉన్న మెయిన్ డ్రైన్ ,గౌరవిది జంక్షన్ నుంచి పాతకూర్మన్నపాలెం జంక్షన్ వరకు ఫుట్పాత్తో కలిగిన బీటీ రోడ్డు 4 గాంధీ బొమ్మ జంక్షన్ నుండి బర్రెల గ్రౌండ్ వరకు సెంట్రల్ లైటింగ్ కూడికన్న బీటీ , గాంధీ బొమ్మ జంక్షన్ నుండి కాలింగా విది చివరి వరకు సెంట్రల్ లైటింగ్ తో కూడిన బిటీ రోడ్డు 6 వడ్లపూడి పెట్రోల్ బంక్ పక్కనుండి లక్ష్మీపురం మీదగా పాతకో అనుమాన పాలెం ముస్తఫా జంక్షన్ వరకు మెయిన్ రోడ్లు అన్నిటి మీద గతంలో శాసనసభ్యుడు , రాష్ట్ర అధ్యక్షుడు అల్లా శ్రీనివాసరావు 2024 సంవత్సరం ఫిబ్రవరి నెల 16 తేదిన అభివృద్ధిపై మాజీ కమిషనర్ సంపత్ కుమార్ కి లెటర్ రూపేనా ఆదేశాలు ఇవ్వడం జరిగిందని ,ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి చెందకుపోవడం వల్ల మరల నూతన కమిషనర్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, స్పందించిన కమిషనర్ వడ్లపూడి బస్ స్టాప్ నుండి గాంధీబొమ్మ జంక్షన్ వరకు త్వరలోనే ఫుట్పాత్తో కూడినటువంటి రోడ్డు నిర్మాణమునకు అంగీకరించడం జరిగిందని వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్ తెలిపారు.

## పండుగల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణి



**గాజువాక పెన్ పవర్ , జూలై01** : మహా విశాఖ నగరపాలక సంస్థ 73వ వార్డు పరిధి గొంతినవాని పాలెంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ రావు చేతుల మీదుగా వృద్ధాప్య మరియు దివ్యంగుల పెన్షన్లను లబ్ది దారులకుఅందచేశారు , ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని చివరి లబ్ది దారుడి వరకు సంక్షేమం అందేలా కృషి చేస్తానని, రాష్ట్రానికి ముఖ్యముగా విశాఖపట్నాన్ని ఐటీ హబ్ గా , వాణిజ్య రాజధానిగా తీర్చదిద్దబోతున్నామని తెలిపారు ,రాబోవు రోజుల్లో ఎన్నికల హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేసారు ,ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ జోనల్ కమిషనర్ శేషాద్రి , టీడీపీ గాజువాక సమానవ్యకర్త ప్రసాదుల శ్రీనివాస్ , 73వ వార్డు టీడీపీ క్లస్టర్ ఇంచార్జి బలగ బాలు నాయుడు , 73వ వార్డు జనసేన అధ్యక్షులు రౌతు గోవింద్ ,73వ వార్డు టీడీపీ అధ్యక్ష కార్యదర్శిలు సింగూరు అనంత్ , నంబరు దేవుడు , 73వార్డు వైస్ ప్రెసిడెంట్ కురందాస్ కృష్ణ , సీనియర్ నాయకులూ పచ్చికోరు అప్పారావు ,జనసేన చిరంజీవి , టీడీపీ బూత్ ఇంచార్జిలు పంపన శ్రీనివాస్ , ఎం రాణి , కొలగాని శ్రీను , లక్ష్మి నారాయణ , జ్యోతి , ప్రమీల , సోమి నాయుడు, వార్డు నాయకులూ సత్యప్రియ శివ , నెహ్రు , గాంధీ , సంతోషి , మరియు గొంతినవాని పాలెం గ్రామా పెద్దలు , కూటమి నాయకులూ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .

## లోకుల గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించిన బీజేపీ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, జూలై 1:**అల్లూరి సీతారామ రాజు జిల్లాలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వర్గీయ లోకుల గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.గూడెంకొత్తవీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, మండల అధ్యక్షులు కాకురి శేఖర్ నేతృత్వంలో పేద మహిళలకు, వృద్ధులకు వస్త్రదానం (చీరలు, దుప్పట్లు) చేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, “మన్యంలో మహానేతగా పేరుగాంచిన లోకుల గాంధీ , విదేశాల్లో ఉన్నత ఉద్యోగం వదిలి ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి రావడం గొప్ప విషయం. అలాంటి నాయకుడు నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం,” అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రీమల పాల్, నడిగట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి





- నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను రద్దు చేయాలి.
- కనీస వేతనం 26వేలు చెల్లించాని డిమాండ్.
- గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర త్రినాథ్.
- సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 01.**కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం 26వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక కార్మికసమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర త్రినాథ్, సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు ఆశ వర్కర్లకు పిలుపునిచ్చారు. మండలంలో గల జోలపుట్టు పంచాయితీ, లబ్బూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ వర్కర్లతో, సిహెచ్ డబ్ల్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 9 తేదీన దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలనే డిమాండ్ తో చేపట్టిన కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆశ వర్కర్లకు 26వేల రూపాయలు వేతనాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లని ఆశలుగా మార్చాలని ఒప్పందం జీవో విడుదల చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేటీకరణలు ఆపాలని, ప్రజా సంపదను కాపాడాలని, కార్మికులకు 10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మె నేపథ్యంలో లబ్బూరు పిహెచ్సి వైద్యాధికారి శ్యాంప్రసాద్ కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు కిముడు శాంతమ్మ, దొర జెమా, సీసా జయసుధ, కొచ్చో సుభద్ర, సిహెచ్ జాన్ మొత్తి, బుల్లమ్మ, కొండమ్మ, ఆశ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కులబీరులో విద్యార్థులకు యూనిఫామ్స్, బ్యాగ్ లు పంపిణీ చేసిన సర్పంచ్ పోర్తిమ

- విద్యార్థిని విద్యార్థులు యూనిఫామ్, బూట్లు ధరించి క్రమం తప్పకుండా బడికి రావాలి.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 01.**మండలంలో గల జర్జుల పంచాయితీ కులబీరు ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు స్థానిక సర్పంచ్ డి పోర్తిమ, ఎంపీటీసీ వి విజయలక్ష్మి స్కూల్ బ్యాగ్ లు, యూనిఫామ్స్, బూట్లు మంగళవారం విద్యార్థినీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పోర్తిమ్మ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులు బడికి యూనిఫామ్ బూట్లు ధరించి క్రమశిక్షణగా ప్రతిరోజు బడికి రావాలన్నారు. ఉపాధ్యాయులు నేర్పించే మంచి విద్యాబుద్ధులు విద్యను శ్రద్ధగా అభ్యసించి ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీటిని త్రాగునీటిగా అందించలన్నారు. భోజనం మెనూ ప్రకారంగా అందించాలన్నారు. మోడల్ పాఠశాలగా పేరు ప్రఖ్యాతలుగా తీసుకొచ్చిన పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలలో సుమారుగా 60 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలపై శ్రద్ధ వహించి ప్రతిరోజు పాఠశాలకు పంపే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ జి జలంధర్, ప్రధానోపాధ్యాయులు సబడ బాలన్న, ఉపాధ్యాయులు కే కామేశ్వరరావు, ఎస్ మాలయ్య, వంతినిభ నూకాలమ్మలతో పాటు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ జన్మదిన వేడుకలు



**చింతపల్లి పెన్ పవర్ జూలై 1:-** చింతపల్లి మండల కేంద్రంలో పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర జన్మదిన వేడుకలనువైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత ల ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాడేరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ్యులు మరియు జిల్లా పరిషత్ చైర్మన్ వారి సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తున్నారన్నారు. గిరిజనుల అభివృద్ధిని ఆకాంక్షించి ముందుకు వెళుతున్న నాయకులు అని వారు కొనియాడారు. ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, ఎంపీటీసీ చిందాడ జయలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిందాడ అప్పారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జల్లి హలియా రాణి, మాజీ ఎంపీపీ మచ్చమ్మ, వార్డు సభ్యుడు బండారు నాయుడు ఎర్రంశెట్టి వెంకటేశ్వరమ్మ వసపరి వెంకటలక్ష్మి రాణి సోషల్ మీడియా కన్వీనర్ పెదపూడి మధు ధారబాబు నరేష్ కావడం ఈశ్వరరావు మరియు అభిమానులు పాల్గొన్నారు. అనంతరం కేకు కట్ చేశారు.

# శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు,



యు. ఎఫ్. ఐ. డి. సి. చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మరియు కుటుంబం సభ్యులు



**విశాఖ దక్షిణం పెన్ పవర్ జులై 01 :** విశాఖపట్నం కొత్త రోడ్డు లో వామనావతారంలో కొలువైన సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామిని మంగళవారం నగర మేయర్ పీలా శ్రీనివాసరావు యు. ఎఫ్. ఐ. డి. సి. చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కుటుంబ సభ్యులు పీలా కృష్ణ అప్పారావు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. శ్రీ జగన్నాథ స్వామి దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి టి. రాజగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు మేయర్ కుటుంబ సభ్యులకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా వారు నగరాభి వృద్ధి తో పాటు నగర ప్రజలు సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని ఆ జగన్నాథ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పీలా కుటుంబ సభ్యులతో పాటు కార్పొరేటర్ కోడూరు అప్పల రత్నం తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో హైవోల్టేజ్ విద్యుత్ సమస్య

- కంప్యూటర్లు, టీవీలు, జెరాక్స్ మిషన్లు, ఫ్రిడ్జ్ లు కాలిపోయి లక్షల్లో నష్టం.
- విద్యుత్ శాఖ అధికారులు హైవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూలై 01.** మండల కేంద్రంలో గత వారం రోజులుగా హైవోల్టేజ్ విద్యుత్ సమస్యతో ఎలక్ట్రానిక్ వస్తువులు, సిపియుడెస్క్ టాప్, జెరాక్స్ మిషన్లు, టీవీలు, ఫ్రిడ్జ్ లు, కంప్యూటర్లలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి కాలిపోయి లక్షల రూపాయలు నష్టపోతున్నామని మండల కేంద్ర వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా విద్యుత్ రావటం పోవటంతో పాటు ఒక్కొక్కసారి హై వోల్టేజ్ రావడంతో జెరాక్స్ షాపుల్లో కంప్యూటర్ సామగ్రిలు హఠాత్తుగా పొగలు వచ్చి పాడైపోతున్నాయని లబోదిబో మంటున్నారు. మూడు నెలలో ఒకసారి జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నప్పటికీ విద్యుత్ సమస్య తీవ్రంగానే ఉందని మండల కేంద్రంలో గల వినియోగదారులు, గృహస్తులు, జిరాక్స్ షాపుయజమానులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి హై వోల్టేజ్ సమస్య లేకుండా చూడాలని, లక్షల్లో కొనుగోలు చేసిన ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోతుండటంతో తీవ్ర నష్టపోతున్నామని పలువురు పేర్కొంటున్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

- వైద్యులను సన్మానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



**విశాఖ దక్షిణం,పెన్ పవర్, జులై 01 :**
జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు , దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ వైద్యులను ఘనంగా సన్మానించారు. కేజీహెచ్ సూపర్డెంట్ వాణి ,కేజీహెచ్ సి ఎస్ ఆర్ ఎం ఓ హరి కి శాలువా వేసి, బొకే అంద జేసి వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివా స్ మాట్లాడుతూ వైద్యులు దేవుళ్ళతో సమా నమని, మానవీయ సేవ కోణంలో నిరంతరం పనిచేస్తారని ఈ సందర్భంగా వారి సేవలు చిరస్మరణీయం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సౌత్ నియోజకవర్గ పాయిం ట్ ఆఫ్ కాంటాక్ట్ శివప్రసాద్ రెడ్డి గ, 30 వార్డ్ జనసేన అధ్యక్షురాలు యజ్ఞశ్రీ ,సీనియర్ నాయ కులు శ్రీను పలువురు ప్రముఖులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ వంపూరు గంగులయ్య జన్మదిన వేడుకలు





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జులై 1:** జనసేన పార్టీ పాడేరు అసెంబ్లీ మరియు అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్. వంపూరు గంగులయ్య యొక్క జన్మదిన వేడుకలు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు జనసేన కార్యాలయంలో వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేయడం, శుభాకాంక్షలు తెలియజేయడం, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ %-% పార్టీ ఆవిర్భావం నుండి నిబద్ధత, క్రమశిక్షణతో సేవలందించిన డాక్టర్ గంగులయ్య పార్టీ అధిష్ఠానానికి విశేషంగా నచ్చిన నాయకుడని ప్రశంసించారు. పాడేరు అసెంబ్లీ టికెట్ పొందే అవకాశాలు చేజారినప్పటికీ, ఆయనలో అసలు ఆసక్తి తగ్గలేదని, పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించారని పేర్కొన్నారు. తన వృత్తితో పాటు, అనేక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన గిరిజన నేతగా గంగులయ్య పార్టీ శ్రేణుల్లో విశేష గౌరవాన్ని పొందారు. ఈ సందర్భంగా తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులకు గంగులయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉన్న అభిమానానికి, ఇలాంటి కుటుంబాన్ని అందించిన జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం ఆధ్వర్యంలో చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీకి చెందిన మర్రి, మనోహర్, వంతల పరమేశ్ డాక్టర్ గంగులయ్య చేతుల మీదుగా జనసేన పార్టీలో చేరారు. పార్టీలో కొత్తగా చేరిన వారిని శాలువాలతో సన్మానించి, పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా మార్గనిర్దేశనం చేశారు. ఈ వేడుకలో విశాఖ రూరల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కిట్లంగి పద్మ,విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గొర్లె వీర వెంకట్,కొర్ర కమల్ హాసన్,అధికార ప్రతినిధి బొంకుల దివ్యలత,పాడేరు మండల అధ్యక్షులునందోలి మురళీ కృష్ణ,ఉపాధ్యక్షులుసీసాల భూపాల్,ఐటీ ఇంచార్జ్ సాలెబు అశోక్,ఐటీ టీమ్ కోఆర్డినేటర్ సీ. హెచ్. అనిల్ కుమార్,పాడేరు టౌన్ ప్రెసిడెంట్ మజ్జి నాగేష్, జీకే వీధి జనసేన పార్టీ అధ్యక్షులు కొయ్యం బాలరాజు,నాయకులు మాసాడి భీమన్న, వంపూరు సురేష్, లంకెల పవన్ తేజ్ రంపచోడవరం వీరమహిళలు పివర లక్ష్మి, కృష్ణవేణి సీనియర్ నాయకులు సీతయ్య, బి. త్రిమూర్తులు చింతపల్లి మండలం నుండి సుర్ల వీరేంద్ర, జయదేవ్, శ్రీను, చిన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ జన్మదిన వేడుకలు పాడేరు నియోజకవర్గంలో జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. పార్టీలో ఈ విధమైన సంఘటనలు నాయకత్వానికి మరియు కార్యకర్తలకు మధ్య ఉన్న బంధాన్ని మరింత బలపరుస్తున్నాయి.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన గంటా



**ఆనందపురం, పెన్ పవర్ జులై 01. :** భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆనంద పురం మండలం గంభీరంలోనూ, పద్మనాభం మండలం పాండ్రంగిలోనూ మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రతి నెల 1 వ తేదీ నాడు ఇంటి వద్దకే కూటమి ప్రభుత్వం పెన్షన్ అందిస్తుండడం పట్ల లబ్ధిదా రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల పెన్షన్ ను రూ.4 వేలకు పెంచామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్న ప్పటికీ.. రాష్ట్రంలో 65.31 లక్షల మందికి రూ. 4,408 కోట్ల పెన్షన్ అందజేస్తున్నామని తెలి పారు. సంక్షేమానికి నాంది పలికిన ఎన్టీఆర్ బాటలోనే పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఏ రాష్ట్రం కూడా ఇంత మొత్తాన్ని పెన్షన్ గా అందించడం లేదని చెప్పారు. అర్హులైన వారందరికీ పెన్షన్ ఇవ్వడా నికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రేషన్ కార్డుల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందు లను పాండ్రంగిలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకురా గా, పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎం.పి.డి.ఓ. ఎం. విజయ్ కుమార్, పార్టీ నాయకులు తాట్రాజు అప్పారావు, ఈశ్వరరావు, అప్పల రాము, చందక అప్పలరాజు, కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కురిమిన లీలావతి, రామరాజు, మొకర అప్పలనాయు డు, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, జూలై 1 :** ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్ఠింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## ప్రజల దయ వలన కూటమి ప్రభుత్వం ఏర్పడింది

- ఏడాదిలో కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు అమలు చేసింది
- జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి



**విశాఖ దక్షిణం పెన్ పవర్ జులై 01 :** ప్రజల దయ వలన కూటమి ప్రభుత్వం ఏర్పడింది ఏడాదిలో ఎన్నో హామీలు అమలు చేశాం అని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు . మంగళవారం సాయంత్రం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేఖరుల బాబ్జి మాట్లాడుతూ రేపటినుండి సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నాం. డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహిస్తాం యాప్ లో ప్రజల అభిప్రాయాలను నమోదు చేస్తాం అని చెప్పారు ఇప్పటికే అమలు చేసిన పథకాలు, ఇంకా రానున్న రోజుల్లో అమలు చేయనున్న పథకాలు కూడా వివరించడం జరుగుతుందని అన్నారు పోలవరం ప్రాజెక్టును 2027 పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం .ఇచ్చిన మాట ప్రకారం సామాజిక భద్రత పెన్షన్లు పెంచాము. అనకాపల్లి జిల్లా లో మిట్టల్ స్టీల్ ప్లాంట్ వస్తుంది విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకుంటాం అని అన్నారు ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం అమలు చేశాము. దీపం మూడో సిలెండర్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము.

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తాం అని చెప్పారు వచ్చే ఏడాది లోపు భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి అవుతుంది. వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను పట్టించుకోవలసిన అవసరం లేదు అని వ్యంగ్యంగా అన్నారు. వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి వైసీపీకి 5 ఏళ్లు పడితే మే ము అధికారం చేపట్టిన వెంటనే వెయ్యి పెంచి 4 వేలు ఇస్తున్నాము అని ఎద్దేవా చేశారు. కూటమి సంక్షేమ పథకాలను, ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ప్రజలు ఛీ కొట్టిన వైసిపి నేతలకు లేదు అని అన్నారు .

ఈ సమావేశంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర పాల్గొన్నారు.

## వైఎస్ జగన్ కు చిత్రపటాన్ని అందజేసిన దొడ్డి కిరణ్



**విజయవాడ, పెన్ పవర్, జూలై 1 :** తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మాజీ మంత్రి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి వైఎస్సార్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ని కలిసి, బ్లడ్ ఆర్ట్ తో చిత్రపటాన్ని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసిన, అందజేశారు విశాఖజిల్లా యూత్ ప్రెసిడెంట్ చందు యాదవ్ స్టేట్ యువజన వాదం మెంబర్స్ కార్పొరేటర్ ఇమ్రాన్, శైలేష్ ,సౌత్ వైఎస్సీపీ యూత్ ప్రెసిడెంట్ రవితేజ, వెస్ట్ వైఎస్సీపీ యూత్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి కిరణ్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ నిర్మల కుమారి ఉద్యోగ విరమణ.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి బాలరాజు సన్మానం



**చింతపల్లి పెన్ పవర్ జులై 1:-** చింతపల్లి మండలంచౌడుపల్లి గ్రామానికిచెందినకోరాబునిర్మలకుమారిఅంగన్వాడికార్యకర్తగా ఉద్యోగాన్ని ప్రారంభించి అంచలంచలుగా గ్రేడ్ వన్ సూపర్వైజర్ స్థాయికి ఐసిడిఎస్ గ్రేడ్ వన్ సూపర్వైజర్ కోరాబు నిర్మల కుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఆ శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. చింతపల్లి మాజీ శాసనసభ్యుడు కోరాబు వెంకటరత్నం కుమార్తె 1963 లో జన్మించిన నిర్మల కుమారి . పదేళ్ల అంగన్వాడి కార్యకర్త తరువాత 1997లో గ్రేడ్ వన్ సూపర్వైజర్ గా పదోన్నతి పొందిన ఆమె సూపర్వైజర్ గా 28 ఏళ్ల పాటు వివిధ ప్రాంతాలలో సేవలు అందించారు. ముందుగా రావికమతం, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ, వడ్డాది మాడుగుల, నర్సీపట్నం, విశాఖపట్నం, అనకాపల్లి తదితరచోట్ల సూపర్వైజర్ గా విధులు నిర్వర్తించిన ఆమె జూన్ 30వ తారీఖున ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులు ఏర్పాటుచేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆమె సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దుస్సాలువాతో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, ఉద్యోగులతో పాటు ఉద్యోగ విరమణ పొందుతున్న నిర్మల కుమారి కుటుంబ సభ్యులు, అభిమానులు, పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి మృతి

**పెన్ పవర్: జి.మాడుగుల.అల్లూరి సీతారామరాజు జిల్లా జులై(1)**

అల్లూరి సీతారామరాజు జిల్లా. జి.మాడుగుల మండలం సారుబయలు గ్రామానికి చెందిన మర్రి లక్ష్మి(13) ఎనిమిదవ తరగతి విద్యార్థిని మంగళవారం ఉదయం విరామ సమయంలో తరగతి గది నుండి బయటకు వెళుతూ అకస్మాత్తుగా కుప్పకూలిపోయిందని ఆమెను వెంటనే ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం పాడేరు హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని తెలిపారు.

# అవును.. ఆ మేక ఖరీదు రూ.కోటికి దగ్గర



**హైదరాబాద్ పెన్ పవర్:** కోటి రూపాయిలు. ఇప్పటికి చాలా పెద్ద మొత్తమే. అలాంటి కోటి రూపాయిలకు దగ్గరగా పలికే మేక ఒకటి ఇప్పుడు సంచలనంగా మారింది. ఇస్పెషల్ మేక సెనగల్ దేశానికి చెందింది. నోరూరించే వంటకాలకు కేరాఫ్ అడ్రస్ గా చెప్పే ఈ దేశంలో కోటి రూపాయిల మేక ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. దీని ఎత్తు నాలుగు అడుగుల వరకు ఉంటుంది.చక్కటి కొమ్ములు.. కండరాల బలిమి ఉన్న ఈ మేకల్ని ఆ దేశంలో తమకు హోదాకు చిహ్నంగా భావిస్తారు. ఆర్థికంగా బలంగా ఉన్న వారు.. ఈ లాదూమ్ అనే మేలు జాతి మేకల్ని పెంచుకోవటానికి ఆసక్తి చూపుతుంటారు. అక్కడి సమాజంలో ఈ జాతి మేకల్ని సంపదకు.. హోదాకు చిహ్నంగా భావిస్తారు.

ఒక సంవత్సరం ఏడు నెలల వయసు ఉన్న ఒక మేక ధర ఏకంగా లక్ష డాలర్ల వరకు పలికి అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. మన రూపాయిల్లో చెప్పాలంటే రూ.85 లక్షల వరకు ఉంటుంది. గతంలో ఇదే జాతికి చెందిన మేకపోతుకు రూ.59 లక్షలు పలకగా.. అదో రికార్డుగా ఉండేది. ఇప్పుడు దానికి మించి దగ్గర దగ్గరగా కోటి రూపాయిల వరకు పలకటంతో ఈ మేకపోతు సోషల్ మీడియాలోనూ వైరల్ గా మారింది. ఇంత భారీ ధర పలకటంతో లాదూమ్ మేకపోతు జాతి మేకల్ని కొనుగోలు చేసేందుకు సెనగల్ కు ప్రత్యేకంగా వెళుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మేక.. మజాకానా అన్నట్లు ఉంది కదూ.

# గన్నవరంలో ల్యాండ్ అయిన చంద్రబాబు హెలికాప్టర్.. ఏం జరిగింది?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో విమానాలు, హెలీకాప్టర్లు ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యాయనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన వరుస ఘటనలు అందుకు కారణం. ఆ సంగతి అలా ఉంచితే... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ గన్నవరంలో ల్యాండ్ అయ్యింది.అవును... కొవ్వూరులో పెన్షన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు హెలికాప్టర్ లో సీఎం చంద్రబాబు ఈ రోజు ఉదయం బయలు దేరారు. అయితే... వాతావరణం అనుకూలించకపోవడంతో ఆయన ప్రయాణిస్తున్న విమానం గన్నవరం ఎయిర్ పోర్ట్ లో తిరిగి ల్యాండ్ అయింది. దీంతో... ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనపై సందిగ్ధత నెలకొందని అంటున్నారు.అయితే... తగ్గేదేలే అని సీఎం ఫిక్సయ్యారని.. ఈ నేపథ్యంలో ప్రత్యేక విమానంలో రాజమండ్రికి వెళ్లి అక్కడ నుంచి షెడ్యూల్ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు తెలుస్తోంది. ఈ రోజు.. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించేందుకు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామంలో ఈ రోజు సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు!కాగా... ఏపీలో పింఛన్లను ఇంటికే వెళ్లి ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఇలా ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికే వెళ్లి పింఛన్లు ఇచ్చే కార్యక్రమంలో చంద్రబాబు, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు కూడా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా.. చంద్రబాబు వెళ్లిన ప్రతి ఇంటికి ఏదో ఒక హామీ కూడా ఇస్తున్నారు.

# ఇదేమైనా సినిమానా సామీ.. ఈ గన్ ఏంది? ఈ బెదిరింపులేంది?



**హైదరాబాద్ పెన్ పవర్:** కొన్ని సందర్భాలు సినిమాటిక్ గా ఉండొచ్చు. ఆ మాత్రం దానికే సినిమాల్లో మాదిరి యాక్షన్ ప్రదర్శిస్తే మొదటికే మోసం వస్తుంది. తాజాగా తాడిపత్రి సీఐ తీరు కూడా అదే రీతిలో ఉందంటున్నారు,. తాజాగా వైసీపీ నేత.. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అకస్మాత్తుగా తాడిపత్రికి రావటంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో స్పందించిన పోలీసులు ఆయన్ను.. తాడిపత్రి నుంచి అనంతపురానికి పంపుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆయన్ను అనంతపురానికి తరలించే క్రమంలో పోలీసుల వాహనాన్ని వైసీపీ వర్గీయులు వెంబడించారు.

ఇలాంటి సమయాల్లో మరింత ఫోర్సును వినియోగించటం.. పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నాల్ని నిలువరించే ప్రయత్నం చేశాయి. అందుకు భిన్నంగా చేతిలోని గన్ ను గురి పెట్టి వార్నింగ్ ఇచ్చిన వైనం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తాడిపత్రి సీఐ సాయి ప్రసాద్ యాక్షన్ సీక్వెన్స్ ను వైసీపీ వర్గీయులు ప్రత్యేకంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అవసరానికి మించిన యాక్షన్ ప్రదర్శించిన ఆయన తీరును అందరూ వేలెత్తి చూపేలా సోషల్ మీడియాలో అప్ లోడ్ చేశారు.

ఈ వీడియో వైరల్ గా మారింది. తాడిపత్రి సీఐ తీరును పలువురు తప్పు పడుతున్నారు. కేతిరెడ్డి వర్గీయులు అడ్డుకునే ప్రయత్నం చేసిన పక్షంలో ఈ తరహా యాక్షన్ అవసరమేమో కానీ.. ఏదో జరుగుతుందన్న ఉద్దేశంతో చేయటాన్ని తప్పు పడుతున్నారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావటం ఖాయమంటున్నారు.

సీఐ చేష్టల్ని పలువురు తప్పు పడుతున్న వేళ.. గన్ తీసి మరీ గురి పెట్టాల్సిన అవసరం ఏముంది? అన్న ప్రశ్నను సంధించిన వేళలో ఆయన స్పందిస్తూ.. “మా వాహనాన్ని అడ్డగిస్తారేమో అన్న ఉద్దేశంతో గన్ తీయాల్సి వచ్చింది. పెద్దారెడ్డి పోలీసుల కస్టడీలో ఉన్నారు. ఆయనపై ఎవరైనా దాడికి పాల్పడతారన్న అనుమానంతోనే గన్ చూపించి వారించినట్లుగా పేర్కొన్నారు. పోలీసు అధికారి ఎవరైనా గన్ తీసి వార్నింగ్ ఇచ్చే పరిస్థితి.. చాలా అరుదుగా ఉంటుందని.. తాడిపత్రి ఎపిసోడ్ లో అంత యాక్షన్ అవసరం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇలాంటి చేష్టలతో ప్రభుత్వాన్ని వేలెత్తి చూపించే అవకాశం ఇచ్చినట్లు అవుతుందని చెబుతున్నారు.

# ‘రెడ్ బుక్’లో ఆ పేరుంది.. శిక్ష పడాల్సిందే: జేసీ



**హైదరాబాద్ పెన్ పవర్:** అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు మరుగుతున్న విషయం తెలిసిందే. వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. పెద్దారెడ్డికి.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డికి మధ్య రాజకీయ దుమారం తారస్థా యికి చేరింది. ఈ క్రమంలో తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి నారా లోకేష్ గత ఏడాది ఎన్నికలకు ముందు %-%రెడ్ బుక్%-% పేరుతో కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. తమకు... తమ పార్టీ నాయకులకు ఇబ్బందులు కలిగిస్తున్నవారి పేర్లను దీనిలో రాసుకున్నట్టు చెప్పారు.

అధికారంలోకి వచ్చాక వారిని పేరు పేరునా శిక్షించి తీరుతామని కూడా.. అప్పట్లో నారా లోకేష్ చెప్పారు. అయితే.. ఇప్పుడు అలా జరుగుతోందని వైసీపీ.. లేదు తాము చట్ట ప్రకారం ముందుకు సాగుతున్నామని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఎవరి వాదన ఎలా ఉన్నా.. మరోసారి జేసీ ప్రభాకర్ రెడ్డి మాత్రం రెడ్ బుక్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో తాడిపత్రి డీఎస్పీగా ఉన్న చైతన్య రెడ్డి పేరు నారా లోకేష్ రాసుకున్న రెడ్ బుక్‌లో ఉందన్నారు. చైతన్య రెడ్డి ఎక్కడ ఉన్నా.. తాము శిక్షించి తీరుతామని జేసీ వ్యాఖ్యానించారు. తమ నాయకులు,

కార్యకర్త లను తీవ్రస్థాయిలో వేధించారని.. కాబట్టి చైతన్యను శిక్షించి తీరాల్సిందేనని పట్టుబట్టారు. చైతన్య ఇప్పుడు ఎక్కడ పని చేస్తున్నా వదిలి పెట్టేది లేదన్నారు. ఇక, ఈ క్రమంలోనే మరో కీలక విషయాన్ని జేసీ చెప్పారు. చైతన్యపై చర్యలు తీసుకోవద్దంటూ.. కనుమూరి బాపిరాజు(కాంగ్రెస్ సీనియర్‌నేత) తనకు ఫోన్ చేశారని.. ఆయనను అమాయకుడిగా పేర్కొన్నారని తెలిపారు.కానీ, చైతన్య రెడ్డి ఏం చేశాడో తమకు తెలుసునని.. ఇక్కడకు వస్తే.. బాధితులను కనుమూరికి చూపిస్తామని చెప్పామన్నారు. కాబట్టి చైతన్య రెడ్డికి తగిన విధంగా శిక్ష పడాల్సిందేనని జేసీ డిమాండ్ చేశారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నగరం నుంచి పోలీసులు బయటకు పంపించారు. అయితే.. గతంలో తనకు అనుకూలంగా హైకోర్టు తీర్పుందని ఆయన చెబుతున్నారు. ఈ క్రమంలో ఆయన హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ వేసే ఆలోచనలో ఉన్నారు.

# అన్నం చేత్తో తింటే తప్పా.. ఏం అమెరికన్ నేతలు రా బై





**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూయార్క్ నగర మేయర్ అభ్యర్థిగా డెమొక్రటిక్ పార్టీ తరఫున విజయం సాధించిన జోహ్రాన్ ఖ్వామీ మమ్దానీ ఇటీవల ఒక భోజనంతో వార్తల్లో నిలిచారు. ఆయన చేత్తో పప్పన్నం తినడమే ఈ వివాదానికి కేంద్రబిందువైంది. అభ్యర్థిత్వ గెలుపు అనంతరం ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మమ్దానీ, ఒక చిన్న ప్లేట్‌లో అన్నం, పప్పు కలుపుకుని హాయిగా చేత్తో తిన్నారు. అయితే ఈ దృశ్యం కొందరికి రుచించలేదు. ఈ వీడియోను ‘ఎడ్ ఓక్‌నెస్’ అనే ఎక్స్ ఖాతాదారు పోస్టు చేసి మమ్దానీ తీరును తప్పుబట్టారు. “అన్నం చేత్తో తినడం అనాగరికం. ఆయన తీరులో థర్డ్ వరల్డ్ దేశాల ముద్ర ఉంది. అలాంటిదే ఆయన స్ఫూర్తిగా చెబుతున్నారన్నమాట” అని ఎద్దేవా చేశారు. దీనికి అమెరికా రిపబ్లికన్ పార్టీ యువనేత బ్రాండన్ జీనీ గిల్ మద్దతు పలికి “ఇలాంటి వాళ్లు అమెరికాలో కాదు, తాము పొగడే దేశాల్లోనే ఉండాలి” అంటూ విమర్శించారు. ఈ సందర్భంలో మరికొంతమంది నేతలు కూడా విమర్శలకు పాల్పడ్డారు. మాన్‌హాట్టన్ జిల్లా అటార్నీ రేసులో ఉన్న రిపబ్లికన్ నాయకురాలు మాడ్ మరూన్ కూడా మమ్దానీని టార్గెట్ చేశారు. “ఇది రాజకీయ స్టంట్ మాత్రమే. సాధారణంగా ఆయన చెంచాతో తింటారు” అని ఆరోపించారు.

**విమర్శలను తిప్పికొట్టిన నెటిజన్లు: సంస్కృతి, జాత్యహంకారంపై చర్చ**

అయితే, మమ్దానీ తినే తీరును జాత్యహంకారంగా పేర్కొంటూ పలువురు నెటిజన్లు ఆయనకు బలంగా మద్దతు తెలిపారు. “తినడం ఒక సంస్కృతి అంశం. చింతకాయ తినాలంటే చేత్తోనే కదా? బర్గర్, ఫ్రెంచ్ ఫ్రైలు, టాకోస్, లేస్ ప్యాకెట్లు కూడా చేత్తోనే తింటారు కదా! మరి అన్నం చేత్తో తినడమే తప్పా?” అని ప్రశ్నించారు. ఈ వాదనను సమర్థిస్తూ పశ్చిమ దేశాల్లో కూడా చేత్తో తినే అనేక ఆహార పదార్థాలు ఉన్నాయని గుర్తు చేశారు. “చేత్తో తినడం అనాగరికమైతే, మీ ఆహారపు అభ్యాసాలే ఎంత అనాగరికమో ముందుగా చూసుకోండి. ఇది జాతిపరమైన అహంకారపు ప్రతిబింబం” అంటూ మరికొందరు విమర్శలను తీవ్రంగా వ్యతిరేకించారు. వేర్వేరు సంస్కృతులకు సంబంధించిన ఆహారపు అలవాట్లను తక్కువ చేసి చూడటం కేవలం వివక్షేనని స్పష్టం చేశారు.

**వ్యక్తిగత ఆచారంపై రాజకీయ చతురత**

జోహ్రాన్ మమ్దానీ తిన్న తీరు నెగెటివ్ ప్రచారానికి గురయ్యింది గానీ ఇది ఒక వ్యక్తిగత, సాంస్కృతిక ఆచారమేనన్న వాదనలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. తినే పద్ధతులు ప్రాంతాన్నిబట్టి, పూర్వీకులపై ఆధారపడి ఉంటాయి. చేత్తో తినడమే తప్పు అని గట్టి వ్యాఖ్యలు చేయడం వెనుక రాజకీయ చతురతే ఎక్కువగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తిగత ఎంపికను రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించే ప్రయత్నమని నెటిజన్లు కూడా స్పష్టం చేస్తున్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం... రేవంత్ సీరియస్ వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కెమికల్ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో... పరిశ్రమ ప్రమాద స్థలిని మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా.. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని ప్రకటించారు.అవును... పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీ ప్రమాద స్థలిని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా.. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు.. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి పరిహారం ఇప్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. క్షతగాత్రులకు ఉచితంగా వైద్య చికిత్స అందిస్తామన్నారు.ఈ సందర్భంగా... మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు ప్రభత్వం అండగా ఉంటుందని పేర్కొన్న ముఖ్యమంత్రి... బాధితుల పిల్లలను చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు భవిష్యత్ లో జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పరిశ్రమలకు స్పష్టమైన సూచనలు ఇస్తామని తెలిపారు.

ఇదే క్రమంలో... తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు ఇప్పిస్తామని చెప్పిన సీఎం... పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా... భద్రతపై కంపెనీ యాజమాన్యాలు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఈ ప్రమాదానికి బాధ్యులైన వారందరిపై చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

**ఘటనపై సీఎం సీరియస్!:**

ప్రమాద స్థలిని పరిక్శీలించిన అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నల వర్షం కురిపించారు. ఇందులో భాగంగా... ప్రమాదం జరిగిన ఫ్యాక్టరీలో పరిశ్రమల శాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? అని అడిగారు.

ఇదే సమయంలో... వాటి పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని అధికారులను ప్రశ్నించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా... ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దంటూ సీరియస్ అయిన సీఎం... ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

ఇదే క్రమంలో... కార్మికులకు బీమా సదుపాయం ఉందా లేదా అని ఆరాతీసిన సీఎం... సిగాచీ పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని .. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాని స్పష్టం చేశారు.

# బీజేపీ అధ్యక్షుల ఎంపిక.. తెర వెనుక చక్రం తిప్పిన చంద్రబాబు?



**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల నియామకంలో ఏపీ సీఎం చంద్రబాబు ప్రమేయం ఉందా? పొలిటికల్ సర్కిల్స్ లో ఇప్పుడు ఇదే హాట్ డిబేట్. రెండు రాష్ట్రాల రాజకీయాల్లో అత్యంత సీనియర్ నాయకుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయంగా చోటుచేసుకునే ప్రతి మార్పు వెనుక ఉంటారని చర్చ జరుగుతూ ఉంటుంది. ఏదో రూపంలో చంద్రబాబును తీసుకువచ్చి తమకు అనుకూలంగా మార్చుకోవాలని అన్నిపార్టీల నేతలు చూస్తుంటారు. దీనికి తాజా ఉదాహరణే రెండు రాష్ట్రాలకు బీజేపీ అధ్యక్షుల నియామకంలో చంద్రబాబు పాత్ర ఉందన్న ఆరోపణలు అని అంటున్నారు.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘంగా పనిచేసిన చంద్రబాబుకు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా ప్రాధాన్యం ఉంది. ఆయన ప్రభావంతోనే రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా మార్పులు, చేర్పులు ఉంటాయని విశ్లేషకుల నుంచి రాజకీయ నాయకుల వరకు అభిప్రాయపడుతుంటారు. తెలంగాణ రాజకీయాలను చంద్రబాబు పెద్దగా పట్టించుకోకపోయినా ఆ రాష్ట్రంలో క్రియాశీలంగా ఉన్న ప్రతిపార్టీ ఏదో ఒక సందర్భంలో చంద్రబాబు పేరును ప్రస్తావనకు తీసుకువస్తూనే ఉంటుంది. ముఖ్యంగా తెలంగాణలో ప్రతిపక్షం బీఆర్ఎస్ తన మనుగడు కోసం చంద్రబాబునే టార్గెట్ చేస్తుంటుంది. బీఆర్ఎస్ రాజకీయంగా మంచి స్థానంలో ఉండాలంటే చంద్రబాబును బూచిగా చూపుతుంటుందని అంటుంటారు. ఈ క్రమంలోనే బీజేపీ అధ్యక్షుల నియామకంలో చంద్రబాబు పేరును మళ్లీ తెరపైకి తెస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల నియామకం పూర్తిగా ఆ పార్టీ అంతర్గత వ్యవహారమైనప్పటికీ.. తెరవెనుక చంద్రబాబు ఉన్నారనే ప్రచారం పెద్ద ఎత్తున చేపడుతున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులు వ్యూహాత్మకంగానే ఈ ప్రచారానికి ప్రాధాన్యమిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్థానంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కూటమి ఏర్పాటుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎంత కృషి చేశారో.. బీజేపీ అధ్యక్షురాలిగా పురందేశ్వరి కూడా అంతే పకడ్బందీగా పనిచేశారంటారు. వాస్తవానికి చంద్రబాబు, పురందేశ్వరి దగ్గర బంధువులు. ఈ ఇద్దరి మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల రాజకీయ వైరం కొనసాగింది. పొత్తు కుదిరిన తర్వాతే వారి కుటుంబాలు దగ్గరయ్యాయి. రాజకీయం, కుటుంబ పరంగా అంతా ఇప్పుడు సెట్ అయిందని అంటారు. అయితే పురందేశ్వరి పదవీకాలం పూర్తవడంతో కొత్తవారిని ఎన్నుకున్నారు. పార్టీ అధ్యక్షురాలిగా పురందేశ్వరికి రెండో సారి కొనసాగించే అవకాశం ఉన్నా, చంద్రబాబు వల్లే ఆమెను తప్పించారని ప్రతిపక్షం విమర్శలు గుప్పిస్తోంది. చంద్రబాబు కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్ల పురందేశ్వరిని తప్పించారని చెబుతున్నారు. అయితే ఇదే సమయంలో పీవీఎన్ మాధవ్ నియామకం వెనుక కూడా చంద్రబాబు పాత్ర ఉందని అంటున్నారు. కూటమిలో చక్కని సమన్వయం కోసం మాధవ్ వంటి మృదు స్వభావి ఉండాలని చంద్రబాబు భావించారని, అందుకే ఆయన సూచన ప్రకారం బీజేపీ పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని మరికొందరు అంటున్నారు. నిజానికి చంద్రబాబు పాత్ర ఉన్నా, లేకపోయినా అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు చంద్రబాబు పేరును ప్రస్తావనకు తీసుకువస్తుండటమే ఆసక్తి రేపుతోంది.

మరోవైపు తెలంగాణలోనూ బీజేపీ అధ్యక్ష నియామకంలో చంద్రబాబు ప్రభావం కనిపిస్తోందని అక్కడి ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి ఏపీలో బీజేపీతో టీడీపీకి పొత్తు ఉన్నా, తెలంగాణలో మాత్రం రెండు పార్టీలు అసలు కలిసి పనిచేయడం లేదు. దీనికి ప్రధాన కారణం బీఆర్ఎస్ రాజకీయంగా నిలదొక్కుకోడానికి ఇప్పటికీ చంద్రబాబును తెలంగాణకు విలన్ గానే ప్రచారం చేస్తోంది. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లింకు పెడుతూనే బీజేపీతోనూ చేతులు కలిపి చంద్రబాబు తెలంగాణకు నష్టం చేస్తున్నారని చెబుతోంది. దీంతో తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నేతలు తమపై చంద్రబాబు నీడ కూడా పడకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారని అంటున్నారు. చంద్రబాబు సైతం తనకు తెలంగాణ రాజకీయాలతో అనవసరమన్నట్లే ఉంటున్నారు. కానీ, తాజాగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు ఎంపిక వెనుక చంద్రబాబు ఉన్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిని డీకే అరుణ, ఈటల రాజేందర్ వంటి సీనియర్లు ఆశించినా, వారు చంద్రబాబు వ్యతిరేకులు అన్న కారణంగానే పదవి ఇవ్వలేదని అంటోంది. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్ష నియామకం కూడా పార్టీ నియమావళి ప్రకారమే జరిగిందని కమలం నేతలు వివరణ ఇస్తున్నారు. మొత్తానికి రాజకీయంగా రెండు రాష్ట్రాల్లో ఎలాంటి కదలిక వచ్చినా, వెనుక చంద్రబాబు పేరు వినిపించడమే విశేషంగా చెబుతున్నారు.

# సినీ నటి వాసుకి (పాకీజా)కి పవన్ కళ్యాణ్ ఆర్థిక సాయం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకానొక సమయంలో వాసుకి (పాకీజా) పాత్ర లేకుండా తెలుగు సినిమాలు విడుదల కాలేదని చెప్పినా అతిశయోక్తి కాదేమో. వెండితెరపై ఎందరినో నవ్వించిన ఆమె.. ప్రస్తుతం పూట గడవడం కోసం భిక్షాటన చేసే దుస్థితిలో ఉన్నారు. ఈ క్రమంలో.. తమిళ ఇండస్ట్రీలో ఎవరూ ఆదుకోకపోవడంతో.. సాయం కోసం ఏపీకి వచ్చారు. ఈ సమయంలో ఆమెను పవన్ కల్యాణ్ ఆదుకున్నారు!అవును... తన దృష్టికి వచ్చిన ఎన్నో సమస్యలపై స్పందిస్తూ, వ్యక్తిగతంగా ఎంతోమంది సహాయం చేసే విషయంలో ముందుండే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్... తీవ్ర తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సినీ నటి వాసుకి (పాకీజా)కి ఆప్త హస్తం అందించారు. ఇందులో భాగంగా.. ఆమె దీన స్థితి తెలిసి చలించిన పవన్ కళ్యాణ్.. రూ. 2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ నేపథ్యంలో... మంగళవారం మధ్యాహ్నం మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఈ మొత్తాన్ని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పి. హరిప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన పాకీజా... పవన్ కళ్యాణ్ చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో.. ఆయన చిన్నవాడైనప్పటికీ ఎదురుగా ఉంటే కాళ్లు మొక్కుతాననంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తన ఆర్థిక పరిస్థితి గురించి నిన్ననే పవన్ కళ్యాణ్ కార్యాలయానికి తెలియజేశాననీ, తక్షణం స్పందించి తగిన విధంగా ఆర్థిక సాయం అందించారని తెలిపారు. పవన్ కళ్యాణ్ కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

# కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ కాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పక్కా కాంగ్రెస్ వాది. ఆయన తండ్రి కాలం నుంచి కాంగ్రెస్ లోనే ఉంటూ వచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనే పెరుగుతూ వచ్చారు. ఆయన అందుకున్న పదవులు అన్నీ కాంగ్రెస్ నుంచి దక్కినవే. ఇక ఆయన ఉమ్మడి ఏపీకి ఏకంగా మూడేళ్ళకు పైగా సీఎం గా చేశారు అంటే అది కాంగ్రెస్ పార్టీ వల్లనే అన్నది అందరికీ తెలిసిందే. ఇక ఆ పార్టీని వీడిన తరువాత ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా కూడా మళ్ళీ తగిన విధంగా ముందుకు రాలేకపోయారు అన్నది అనుచరుల అభిమానుల ఆవేదనగా ఉంది. కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలో ఉన్నారు అంటే ఉన్నారు. అయితే అక్కడ ఆయనకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఉమ్మడి ఏపీలో ఏకంగా 23 ఉమ్మడి జిల్లాలకు ఆయన ముఖ్యమంత్రిగా పనిచేశారు. అంతే కాదు దక్షిణాదిన అతి పెద్ద రాష్ట్రాన్ని అత్యంత క్లిష్ట పరిస్థితులల్లో ఆయన పాలించారు. ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వేళ ఆయన సీఎం గా ఉన్నారు. అయినా పాలన ఎక్కడా దెబ్బ తినకుండా సమర్ధంగా వ్యవహరించారు.

అటువంటి కిరణ్ కుమార్ రెడ్డికి బీజేపీలో తగిన ప్రాధాన్యత దక్కడం లేదా అన్న చర్చ అయితే సాగుతోంది. ఇక చూస్తే బీజేపీ హైకమాండ్ ఆయనకు అపాయింట్మెంట్లు కూడా ఇవ్వడం లేదు అని అంటున్నారు. ఇక చూస్తే ఏపీ కాంగ్రెస్ తో పాటు దేశంలోని సీనియర్ కాంగ్రెస్ నేతలతో కిరణ్ కుమార్ రెడ్డికి ఈ రోజుకీ మంచి సంబంధాలు ఉన్నాయని చెబుతారు. ఏపీలో చూస్తే వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ గా ఉన్నా కూడా ఆ పార్టీ ఏ మాత్రం ఎత్తిగిల్లడం లేదు అని గుర్తు చేస్తున్నారు. అలాగని ఇప్పటికిప్పుడు ఆమెను మార్చే ఆలోచన అయితే హైకమాండ్ కి లేదు అని అంటున్నారు. అయితే ఏపీలో టీడీపీ కూటమి ఫెయిల్ అయింది అని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. మరి ఆ చాన్స్ ని ఏపీలో కాంగ్రెస్ తీసుకుని పుంజుకోవడం లేదు అన్న చర్చ అయితే ఉంది. ఇక చూస్తే కనుక షర్మిల వెంట సీనియర్లు ఎవరూ నడవడం లేదు అన్నది కూడా పార్టీ పెద్దలు గుర్తించారు అని అంటున్నారు. ౦౦ఇక కాంగ్రెస్ పార్టీలో చూస్తే ఎంతో మంది నాయకులు ఉన్నారు. మాజీ మంత్రులు మాజీ ఎమ్మెల్యేలతో షర్మిలకు అయితే పెద్దగా మంచి పరిచయాలు కానీ సంబంధాలు కానీ లేవని అంటున్నారు. ఇక కాంగ్రెస్ లో సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావుకు అందరితో మంచి సంబంధాలు ఉన్నా ఆయన షర్మిలకు మాత్రం పూర్తి స్థాయిలో సపోర్ట్ చేయడం లేదు అని అంటున్నారు. ఈ రోజున ఏపీలో చూస్తే రాజకీయంగా ఒక రకమైన శూన్యత ఉందని అంటున్నారు. మూడు పార్టీలూ కూటమిలో ఉన్నాయి. ఇక అక్కడ అంతా కిక్కిరిసిపోయి ఉంది. విపక్షంలో చూస్తే వైసీపీ ఉంది. ఈ రెండు వేదికలు తప్పించి మరోటి లేక చాలా మంది నాయకులు రాజకీయంగా ముందుకు రావాలని చూస్తున్నా సరైన రాజకీయ ఫ్లాట్ ఫారం లేదని అంటున్నారు.

అంటే అటు కూటమి నచ్చక ఇటు వైసీపీలో చేరడం ఇష్టం లేని వారికి కాంగ్రెస్ పార్టీ కనుక గట్టిగా పుంజుకుంటే అందులోకి రావాలని ఉందని చెబుతున్నారు. సమర్ధులైన నాయకులు కాంగ్రెస్ కి నాయకత్వం వహించి జనంలోకి పార్టీని తీసుకుని వెళ్తే కనుక కచ్చితంగా కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతుంది అని అంటున్నారు. ఇక జగన్ మాజీ సీఎం గా ఉన్నారు. ఆయన పార్టీగా వైసీపీ ఉంది. మరి ఆయన సోదరిగా ఉన్న షర్మిలకు కాంగ్రెస్ పగ్గాలు ఇస్తే అదే కుటుంబంలోని వైఎస్సార్ అభిమానులు ఎలా వెళ్తారు అన్న చర్చ కూడా సాగుతోంది. ఇక ఏపీ రాజకీయాల్లో రెడ్డీస్ ఫ్యాక్టర్ చాలానే ఉంది అని అంటున్నారు. రాజకీయంగా ఆ సామాజిక వర్గం ఎపుడూ ముఖ్య పాత్ర పోషిస్తూ ఉంటోంది. అలాంటి రెడ్డీస్ ని కాంగ్రెస్ వైపు తిప్పే సత్తా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిలోనే ఉందని చాలా మంది సీనియర్లు నమ్ముతున్నారు.

ఈ నేపథ్యంలో బీజేపీలో పెద్దగా ప్రాధాన్యత లేకుండా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ కాల్ చేసి సొంత పార్టీలోకి తీసుకుని రావచ్చు అని అంటున్నారు. అయితే ఈసరికే ఆయనకు కాల్ చేశారా అన్న చర్చ కూడా ఉంది. దీంతో కాంగ్రెస్ లో ఇపుడు నల్లారి వారి పునరాగమనం మీదనే హాట్ హాట్ డిస్కషన్ సాగుతోంది. నిజంగా కిరణ్ కుమార్ రెడ్డి ఏపీ కాంగ్రెస్ పగ్గాలు తీసుకుంటే మాత్రం హస్తం పార్టీ రాజకీయ జాతకం మొత్తానికి మొత్తం మారుతుందని అంటున్నారు. ఏపీలో ఇపుడున్న రాజకీయ పరిస్థితుల్లో థర్డ్ ఫోర్స్ గా కాంగ్రెస్ కి ఎదిగే చాన్స్ తప్పకుండా ఉందని అంటున్నారు.

# అకస్మాత్తుగా 900 అడుగుల కిందికి దిగిన విమానం... రంగంలోకి డీజీసీఏ!



**హైదరాబాద్ పెన్ పవర్:** గత నెల 12వ తేదీన అహ్మదాబాద్ నుంచి లండన్ కు బయలుదేరిన ఎయిరిండియా విమానం ఒక్కసారిగా కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటన దేశం మొత్తాన్ని ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈఘటనలో 241 మంది ప్రయాణికులు, 19 మంది పౌరులు మరణించారు. అయితే.. అది జరిగిన రెండు రోజుల్లోపే మరో ఎయిరిండియా విమానం త్రుటిలో ఘోర ప్రమాదాన్ని తప్పించుకుందనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

అవును... గత నెలలో జరిగిన ఎయిరిండియా ప్రమాదం వందల కుటుంబాల్లో తీవ్ర దుఖాన్ని, తీరని శోకాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ విమాన ప్రమాదం జరిగిన రెండు రోజుల్లోపే మరో ఎయిరిండియా విమానం త్రుటిలో ఘోర ప్రమాదాన్ని తప్పించుకుంది. ఇందులో భాగంగా.. ఢిల్లీ నుంచి వియన్నాకు బయలుదేరిన బోయింగ్ విమానం ఒక్కసారిగా 900 అడుగుల మేర కిందికి దిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 14న ఢిల్లీ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం... కొద్దిసేపటికే అకస్మాత్తుగా భూమి సమీపంలోకి దిగిపోవడం మొదలుపెట్టింది. దీంతో... వెంటనే వార్నింగ్ సిగ్నల్ వెలువడింది. ఇదే సమయంలో... పైలట్లు భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. దీంతో.. విమానం కంట్రోల్ లోకి వచ్చింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా సురక్షితంగా విమాన ప్రయాణాన్ని కొనసాగించారు. అయితే... అప్పటికి రెండు రోజుల క్రితం జూన్ 12న అహ్మదాబాద్ లో ఘోర విమాన ప్రమాదం జరిగి ఉండటంతో.. ఆ విమానంలోని ప్రయాణికులంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విచారణకు ఆదేశించింది. ఈ సమయంలో... ఆ ఇద్దరు పైలట్లను విధులకు దూరంగా ఉంచాలని ఆదేశించడంతో పాటు ఎయిరిండియాకు జూన్ 17న సమన్లు జారీ చేసింది. కాగా... గత నెలలో అహ్మదాద్ లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 242 మంది ప్రయాణికుల్లో ఒకేఒక్క వ్యక్తి మాత్రం ప్రాణాలతో బయటపడిన సంగతి తెలిసిందే. ఇదే సమయలో సమీపంలోని స్థానికులు 19 మంది చనిపోయారు. ఇలా ఈ ప్రమాదంలో 260 మంది మరణించారు. దీంతో.. భారతదేశ చరిత్రలో జరిగిన ఘోర విమాన ప్రమాదాల్లో ఇది ఒకటిగా నిలిచింది. మరోవైపు ఈ ప్రమాదంపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు చేస్తోన్న సంగతీ తెలిసిందే. ఈ క్రమంలో బ్లాక్ బాక్స్ లోని డేటాను బయటకు తీసే ప్రక్రియను టెక్నికల్ టీమ్ ప్రారంభించిందని.. అనంతరం జూన్ 25న మెమొరీ మాడ్యూల్ ను విజయవంతంగా యాక్సెస్ చేసి, అందులోని డేటాను ఏఏఐబీ ల్యాబ్ లో డౌన్ లోడ్ చేశామని పౌర విమానయాన శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# పెయిడ్ పాత్రికేయులతో తలనొప్పులు.. టీడీపీ, వైసీపీలకు ఒకే రకమైన టార్చర్



**హైదరాబాద్ పెన్ పవర్:** నిన్న వైసీపీ.. ఈ రోజు టీడీపీ.. తమ పార్టీలకు అనుబంధంగా పనిచేస్తున్న జర్నలిస్టులతో చిక్కుల్లో పడుతున్నాయని టాక్ వినిపిస్తోంది. యూట్యూబ్, డిజిటల్ మీడియా ప్రభావం బాగా పెరగడంతో ఇటీవల కాలంలో ఇండిపెండెంట్ జర్నలిజం ఎక్కువైంది. దీంతో చాలా మంది జర్నలిస్టులు సొంతంగా చానళ్లు ప్రారంభిస్తున్నారు. కొందరు కొన్ని చానళ్లలో జరిగే డిబెట్లకు వెళుతూ తమ వాణి వినిపిస్తున్నారు. అయితే కొందరు జర్నలిస్టులు ఇలా డిబేట్లు, తమ చానళ్లలో విశ్లేషణలలో ఏదో ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటమే విమర్శలకు తావిస్తోంది. అదే సమయంలో ఆయా పార్టీల గ్రాఫ్ ను దెబ్బతీస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పెయిడ్ పాత్రికేయం పెరిగిపోయిందనే విమర్శలు ఉన్నప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో శ్రుతిమించిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యూట్యూబ్ ప్రభావంతో చాలా కాలం క్రితమే కొందరు జర్నలిస్టులు పెయిడ్ గెస్టులుగా మారిపోయారని అంటున్నారు. పార్టీల నుంచి డబ్బు తీసుకుని ఆ పార్టీలకు అనుకూలంగా మాట్లాడుతూ ప్రజలను ప్రభావితం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ప్రజలపై వీరి ప్రభావం ఏ మేరకు ఉంటుందో కానీ, ఆయా పార్టీలు మాత్రం ఎక్కువగా దెబ్బతింటున్నాయని అంటున్నారు.

గత ఎన్నికల వరకు వైసీపీకి ప్రజల్లో మంచి గ్రాఫ్ ఉందని ఈ పెయిడ్ జర్నలిస్టులు చేసిన ప్రచారంతో ఆ పార్టీ ఎక్కువగా నష్టపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటించకుండా, ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోకుండా చాలా మంది హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లో కూర్చొని ఇదే ప్రజాభిప్రాయం అంటూ తమ సొంత వ్యాఖ్యానాలు చేయడం పార్టీల నాయకత్వాలు కూడా అదే నిజమని నమ్మి దెబ్బతింటున్నాయని అంటున్నారు. ఇది ఒక్క వైసీపీకే కాదని తెలుగుదేశం పార్టీ కూడా ఇలాంటి పెయిట్ జర్నలిస్టులను ఎక్కువగా నమ్ముకుందని ఇటీవల పరిణామాలు చెబుతున్నాయంటున్నారు. అటు తెలంగాణలోనూ అన్నిపార్టీలు కూడా కొందరు జర్నలిస్టులను ఎంగేజ్ చేసుకుని తమకు అనుకూలంగా ప్రజలను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తున్నాయని చెబుతున్నారు. అయితే పార్టీల నుంచి డబ్బు అందుకుంటున్న కొందరు జర్నలిస్టులు టీవీ చానళ్ల డిబేట్ సందర్భంగాను, యూట్యూబ్ ఇంటర్వ్యూల్లోనూ విద్వేషాలు రెచ్చగొట్టేలా, ఇతరులను కించపరిచేలా, టార్గెట్ చేసిన వారి ఆత్మస్థైర్యం దెబ్బకొట్టేలా వ్యాఖ్యలు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయంటున్నారు. రిటైర్ అయిన జర్నలిస్టులు, ఉద్యోగాలు లేని పాత్రికేయులు ఎక్కువగా ఎనలిస్టు అవతారం ఎత్తడం, వారిని సమన్వయం చేయడంలో పార్టీలు పెద్దగా దృష్టి పెట్టకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. ఎనలిస్టులుగా మారిన జర్నలిస్టులు వల్ల మేలు జారుతుందని ఆశిస్తే, కీడే ఎక్కువగా జరుగుతుందని ఇటీవల పరిణామాలు నిరూపిస్తున్నాయని అంటున్నారు.

# ఆర్సీబీ న్యూసెన్స్ చేసింది.. పోలీసులపై ట్రైబ్యునల్ ఆసక్తికర వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూరులోని చినస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన పెను దుమారం రేపింది. ఈ సమయంలో ఈ ఘటనకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ సంచలన వ్యాఖ్యలు చేసింది. అవును... బెంగళూరులో ఇటీవల చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) కీలక వ్యాఖ్యలు చేసింది. ఇందులో భాగంగా... అక్కడ లక్షల సంఖ్యలో అభిమానులు గుమిగూడటానికి 'రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు'నే కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని పేర్కొంది. ఈ సందర్భంగా ఓ ఐపీఎస్ అధికారి సస్పెన్షన్ ను రద్దు చేసింది.

ఈ సందర్భంగా స్పందించిన ట్రైబ్యునల్... మూడు నుంచి ఐదు లక్షల మంది ప్రజలు గుమిగూడటానికి ఆర్సీబీనే కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని తెలిపింది. పోలీసుల నుంచి అవసరమైన అనుమతులు లేదా సమ్మతిని వాళ్లు తీసుకోలేదని వ్యాఖ్యానించింది. అకస్మాత్తుగా సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి తరలివచ్చారని పేర్కొంది. ఇదే సమయంలో... పోలీసు సిబ్బంది కూడా మనుషులేనని.. వారు దేవుళ్లు లేదా ఇంద్రజాలికులు కాదని.. వేలు రుద్దడం ద్వారా ఎలాంటి కోరికనైనా తీర్చగల 'అల్లాదీన్ అద్భుత దీపం' వంటి మాయా శక్తులు కూడా వారికి లేవని వ్యాఖ్యానించింది. సుమారు 12 గంటల తక్కువ సమయంలో భద్రతా ఏర్పాట్లు చేస్తారని పోలీసుల నుంచి ఆశించలేమని ట్రైబ్యునల్ పేర్కొంది. జూన్ 4, 2025న సమయం లేకపోవడం వల్ల పోలీసులు తగిన ఏర్పాట్లు చేయలేకపోయారని.. పోలీసులకు తగినంత సమయం ఇవ్వలేదని చెబుతూ.. బెంగళూరు పోలీసు అధికారి వికాస్ కుమార్ తన సస్పెన్షన్ ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించినప్పుడు ట్రిబ్యునల్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా ఆ ఐపీఎస్ అధికారి సస్పెన్షన్ ను రద్దు చేసింది.

# కొబ్బరి ముంజలు.. బెజవాడి కుర్రాడి ఐడియాకు మార్కెట్ ఫిదా



పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నారు పెద్దలు. ఆ మాటను పక్కాగా ఫాలో అయ్యాడు విజయవాడకు చెందిన కుర్రాడు వికాస్. రైతు కుటుంబం నుంచి వచ్చిన అతగాడి పూర్వీకులు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వారు. కొబ్బరి మీద వారికి సహజంగా ఉండే అభిమానంతో దాన్నే తన వ్యాపారంగా మార్చుకున్నాడు. 2019లో కొబ్బరిపొడి పరిశ్రమను ఏర్పాటు చేసి.. కోట్లాది రూపాయిల్ని పోగొట్టుకున్నాడు. అయినా వెనక్కి తగ్గని అతడు కొబ్బరి ముంజ కాన్సెప్టుకు తెర తీయటమే కాదు.. కొబ్బరితో దాదాపు పదుల సంఖ్యలో ఉత్పత్తుల్ని మార్కెట్లోకి తేవటం ద్వారా.. కొబ్బరి రైతులకు ఆదాయం వచ్చేలా చేయటమే కాదు.. కోట్లాది రూపాయిలు సంపాదిస్తున్న అతగాడి సక్సెస్ స్టోరీ.. కొత్త స్ఫూర్తిని ఇస్తుందని చెప్పక తప్పదు. విజయానికి ముందు ఓటమి పరీక్ష పెడుతుంది. దాన్నికష్టంతో సమాధానమిస్తూ.. సహనంతో అధిగమిస్తే అనూహ్య ఫలితాలు ఖాయం. వికాస్ అదే పని చేశాడు. కోస్తా జిల్లాల వారికి తాటి ముంజల గురించి తెలిసిందే. కూల్ యాపిల్ గా పలువురు పిలుచుకునే తాటి ముంజల మాదిరి..కొబ్బరితో కోకో ముంజ్ ను తయారు చేస్తే? సరిగ్గా ఇలాంటి ఐడియాతో పాటు.. కొబ్బరితో 60కు పైగా పదార్థాల్ని తయారు చేయటం ద్వారా అటు ఆరోగ్యం.. ఇటు వ్యాపారాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాలన్న విజయవాడ యువకుడి కలకు ఇప్పుడు సానుకూల ఫలితాలు వస్తున్నాయి.

క్రిష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి.. వినూత్న పద్ధతిలో కొబ్బరితో చేస్తున్న 60 రకాలు ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాయి. త్వరలో దేశ వ్యాప్తంగా ప్రముఖ దుకాణాల్లోనూ వీటిని అందుబాటులోకి తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఎలాంటి రంగు.. రసాయనాల్ని కలపకుండా కేవలం కొబ్బరి నీళ్లను ప్రాసెస్ చేసి తాటి ముంజల్ని తలపించేలా తయ్యా చేస్తున్నారు. కోల్డ్ బ్రూస్ కాఫీని మామూలు నీళ్లతో తయారు చేస్తే.. ఇతగాడు మాత్రం కొబ్బరి నీళ్లతో చేయటం గమనార్హం. కొబ్బరి తురుము.. పాలు.. నీటితో 20కు పైగా వెరైటీ ఫుడ్ లను.. 40 రకాల కేక్ లు.. మిల్క్ షేక్ లు.. ఐస్ క్రీములు.. బిస్కెట్లు.. కాఫీ లాంటి పదార్థాల్ని తయారు చేస్తూ.. అందరిని ఆకర్షిస్తున్నాడు.

సాధారణంగా కాఫీని మామూలు పాలతో కలిసి చేస్తారు. వికాస్ మాత్రం కొబ్బరి పాలతో చిక్కని కాఫీ తయారు చేస్తారు. ఈ కాఫీకి మరో స్పెషల్ ఉంది. అదేమంటే..ఈ కాఫీలో పంచదార కాకుండా.. కొబ్బరి గెల నుంచి వచ్చే నీరాతో చేసిన చక్కెర.. తేన వేయటం ద్వారా భిన్నమైన రుచిని తీసుకొచ్చి.. అందరి మనసుల్ని దోచేస్తున్నాడు. తన ఉత్పత్తులతో అటు ఆరోగ్యం.. ఇటు అనారోగ్యానికి చెక్ పెట్టేలా సిద్ధం చేయటం ఇస్పెషల్ గా చెప్పాలి.కొబ్బరితో రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించేలా చేసి షుగర్ కు చెక్ పెట్టటం.. నీరసం.. మలబద్ధకం.. థైరాయిడ్ సమస్యలకు చెక్ పెట్టేలా తన ఉత్పత్తులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొబ్బరి నీళ్లతో చెడు కొవ్వు కరిగేలా చేయటంతో పాటు.. కిడ్నీలో రాళ్లు కరిగించే శక్తి ఉంటుంది కొబ్బరి పాలలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీవక్రియ మరింత మెరుగవుతుంది. ఇలా ఆరోగ్యానికి మేలు చేసే అంశాలతో తన ఉత్పత్తుల్ని సిద్ధం చేసిన వికాస్.. ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాడు. అతడు మరిన్ని విజయాల్ని సొంతం చేసుకోవాలని ఆశిద్దాం.

# 'మొత్తం సెట్ చేశా.. ఇక దిగిపోతా'.. బోయింగ్ టాప్ ఆఫీసర్ కీలక వ్యాఖ్యలు!

సంక్షోభంలో చిక్కుకున్న విమాన తయారీ సంస్థను నిలబెట్టడానికి గత సంవత్సరం అమెరికా కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద నిధుల సేకరణలలో ఒకదానిని నిర్వహించడంలో కీలక భూమిక పోషించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బ్రియాన్ వెస్ట్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు బోయింగ్ కంపెనీ తెలిపింది. ఆగస్టు మధ్యలో వెస్ట్ ఈ పదవి నుంచి వైదొలుగుతున్నారని వెల్లడించింది. అవును... అమెరికాకు చెందిన విమాన నిర్మాణసంస్థ బోయింగ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బ్రియాన్ వెస్ట్ తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు సంస్థ ప్రకటించింది. గతేడాది బోయింగ్ సంస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో నిధుల సేకరణలో అయన కీలక పాత్ర పోషించారని తెలిపింది! ఆయన స్థానంలో లాక్ హీడ్ మార్టిన్ కార్ప్ మాజీ ఎగ్జిక్యూటివ్ జీసస్ జె మాలావే బాధ్యతలు స్వీకరించనున్నారు. బోయింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెల్లీ ఓర్ట్ బర్గ్ బ్రియాన్ వెస్ట్ సలహాదారుగా కొనసాగుతారని సంస్థ వెల్లడించింది. ఈ రెండు చర్యలు ఆగస్టు 15 నుండి అమల్లోకి వస్తాయని కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా స్పందించిన వెస్ట్... బోయింగ్ లో ప్రస్తుతం బ్యాలెన్స్ షీట్ బలంగా, నిర్వహణ సామర్థ్యం మెరుగ్గా ఉండడంతో తాను పదవి నుంచి దిగిపోవడానికి ఇదే సరైన సమయమని అన్నారు. గత సంవత్సరం తీవ్ర సమ్మె తర్వాత ఉత్పత్తిలో తీవ్ర మందగమనం కారణంగా రేటింగ్ లు దారుణమైన స్థితికి దిగజారకుండా ఉండటానికి.. నిధుల సమీకరణ చేపట్టడంలో వెస్ట్ కీలక భూమిక పోషించారు. %వి%24 బిలియన్ల ఈక్విటీ అమ్మకంతో బోయింగ్ నగదు నిల్వలను పెంచడంలో ఆయన పాత్ర కీలకం. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఆ సంస్థ స్టాక్ 18% లాభపడింది.

# రోజు రోజుకీ పెరుగుతున్న అక్రమ సంబంధాలకు ఇవే అసలు కారణాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో వివాహేతర సంబంధాలు విపరీతంగా పెరిగిపోతున్న సంగతి తెలిసిందే! అంతే కాకుండా.. వాటి కారణంగా జరుగుతున్న నేరాలు, ఘోరాలూ మరింత ఆందోళనకరంగా మారుతున్నాయి. పైగా గత కొన్ని నెలలుగా వరుసగా ఈ తరహా ఘటలను తెరపైకి వస్తున్నాయి. ఈ సమయంలో... ఈ అక్రమ సంబంధాలు విపరీతంగా పెరిగిపోవడానికి గల కారణాలు ఏమిటనేది ఇప్పుడు చూద్దామ్...!

అవును... అక్రమ సంబంధాల వ్యవహారాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి! వీటి ఫలితంగా జరుగుతున్న నేరాలు, ఘోరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి కారణంగా నాశనం అవుతున్న వారి జీవితాల సంగతి అలా ఉంచితే... బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లల జీవితాలను అందకారంలోకి నెట్టేస్తున్నాయి. పాపం పుణ్యం ఎరుగని వయసులో వారి మనసుల్లో తీవ్రమైన అలజడిని, ఆందోళనను సృష్టిస్తున్నాయి.

ఇలా రోజు రోజుకీ పెరిగిపోతూ, తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అక్రమ సంబంధాలకు ప్రత్యేకంగా ఒకటే కారణం అని ఉండదని అంటున్నారు నిపుణులు. ఇందులో పలు కారణాలు శరీరానికి సంబంధించినవి అయితే.. మరిన్ని కారణాలు మనసుకు సంబంధించినవని చెబుతున్నారు. ఈ విషయంలోఈ ఆడ, మగా అనే తేడాలేమీ ఉండవని, ఇద్దరివైపు నుంచి కారణాలుంటాయని అంటున్నారు.

ఇందులో ప్రధానంగా... భార్యాభర్తల మధ్య భావోద్వేగ సాన్నిహిత్యం కొరవడటం ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. ఇద్దరి మధ్య ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, వినకపోవడం, అభినందించకపోవడం వంటివి బయట సాన్నిహిత్యాన్ని కోరుకునేలా చేస్తాయి. భర్త లేదా భార్య నుండి తగినంత ప్రేమ, శ్రద్ధ, గౌరవం లభించడం లేదని భావించినప్పుడు, ఆ ఖాళీని మరొకరితో నింపుకోవాలని చూస్తారు. ఇదే క్రమంలో... లైంగిక కోరికలు తీరకపోవడం లేదా భాగస్వామితో శారీరక సాన్నిహిత్యం తగ్గిపోవడం కూడా ఈ అక్రమ సంబంధాలకు మరో ప్రధాన కారణం అని అంటున్నారు. అదే విధంగా... మరికొంతమంది దంపతుల్లో కొత్తదనం కోరుకోవడం, ఉత్సాహం ఆశించడం కూడా దీనికి దారితీయవచ్చని చెబుతున్నారు.

దీంతో... కాలక్రమేణా భాగస్వాముల మధ్య ఎమోషన్స్ కరువవ్వడం, మానసిక దూరం పెరగడం, కమ్యూనికేషన్ లేకపోవడం, భావాలను పంచుకోలేకపోవడం, ఒకరు పంచుకున్నా మరొకరు అర్థం చేసుకోకపోవడం జరుగుతుందని.. దీని తదుపరి దశ అక్రమ సంబంధాలేనని చెబుతున్నారు. ఇలా అటు శారీరక, మానసిక సమస్యల ఫలితమే వీటికి ప్రధాన కారణమని చెబుతున్నారు.

ఇదే సమయంలో.. ఇతరులను చూసి, కొత్త కొత్త కోరికలు పెంచుకుని, వాటిని తీర్చుకోవడానికి ఆర్థిక స్థోమత సరిపడక పలువురు ఈ మార్గాలను ఎంచుకుంటారని చెబుతున్నారు. ఇటువంటి ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. ఇలా.. నేటి సమాజంలో మానవ సంబంధాల మధ్య పెరిగిపోతున్న ఆర్థిక సంబంధాలు ఒక ప్రధన కారణమని అంటున్నారు.

**పరిష్కార మార్గాలు:**

భాగస్వామిపై కాకుండా మరొకరిపైకి ఆలోచనలు మళ్లుతున్నప్పుడు ఎవరికి వారే స్వీయ నియంత్రణ పాటించేలా ప్రయత్నించాలి. ఇలాంటి వాటిని ప్రోత్సహించే స్నేహితులకు దూరంగా ఉండే ప్రయత్నాలు చేయాలి. ఇక అక్రమ సంబంధాలు బయటపడినప్పుడు.. నిపుణులు కౌన్సెలింగ్, థెరపీని సిఫార్సు చేస్తారు. ఇది జంటల మధ్య బంధాన్ని పునర్నిర్మించుకోవడానికి సహాయపడుతుంది.

# మళ్ళీ పాదయాత్ర... జగన్ సంచలన ప్రకటన వెనక ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ంవైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి పాదయాత్రకు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు ఆయన సంచలన ప్రకటనను వైసీపీ యూత్ లీడర్ల సమీక్షా సమావేశంలో ప్రకటించారు. డేట్ టైం చెప్పలేదు కానీ పాదయాత్ర కచ్చితంగా ఉంటుందని స్పష్టంగా చెప్పేశారు. ఆయన పార్టీ యువజన విభాగం నాయకులతో మాట్లాడుతూ తాను జిల్లాల పర్యటనలు చేస్తూ ఉంటాను అని చెప్పారు. అదే సమయంలో పాదయాత్ర కూడా చేస్తాను అని జగన్ కీలక ప్రకటన చేశారు. రాబోయే ఎన్నికల ముందు తాను పాదయాత్ర చేస్తానని జగన్ స్పష్టం చేశారు. అంతే కాదు పార్టీ సోషల్ మీడియా వింగ్ ను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ రోజులలో ఫోన్ ఒక బ్రహ్మాండమైన ఆయుధమని ఆయన యువతకు చెప్పారు.

పార్టీ కార్యకర్తలకు ఎవరికైనా అన్యాయం జరిగితే సోషల్ మీడియాలో వెంటనే పోస్ట్ చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఇక తాను చేపట్టబోయే పాదయాత్రలో సోషల్ మీడియా యాక్టివిస్టులందరినీ కలుస్తానని వారిని పేరు పేరునా పిలుస్తాను అని జగన్ చెబుతూ వారిలో హుషార్ కలుగజేశారు. ఇవన్నీ పక్కన పెడితే తాజాగా జగన్ చేసిన ప్రకటనతో ఏపీలో మరో భారీ పాదయాత్ర అన్నది తథ్యమని అర్థం అవుతోంది. ఇక జగన్ పాదయాత్ర చేయడం ఇదే తొలిసారి కాదు, ఆయన 2017 నవంబర్ 6 నుంచి 2019 జనవరి 9 వరకూ ఏకంగా పదిహేను నెలల పాటు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మూడు వేల ఏడు వందల కిలోమీటర్ల మేర ఏపీ అంతా తిరిగారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా జగన్ పాదయాత్ర సాగింది. ఆ పాదయాత్ర ఫలితమే ఆయనకు 2019 ఎన్నికల్లో 151 సీట్లను అందించింది. ఆయన ప్రజలతో మమేకం అయిన తీరుకు మంచి స్పందన లభించింది. ప్రజల మధ్య నుంచే తన ఎన్నికల మేనిఫెస్టో ఉంటుందని చెప్పి ఆనాడు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల నుంచే తన నవరత్నాల పథకాలను తయారు చేశారు. వాటికి మంచి స్పందన లభించడం తోనే ఆయన అధికారం అందుకున్నారు. నిజం చెప్పాలంటే వైసీపీ రాజకీయ ప్రస్థానంలో జగన్ పాదయాత్ర ఒక మైలురాయిగా ఉంటుంది. మరి అలాంటి పాదయాత్ర మరోసారి చేస్తాను అని జగన్ అంటున్నారు. ఈసారి ఎలాంటి ప్రభావం ఉంటుంది అన్నదే చర్చగా ఉంది. ఎందుకంటే జగన్ 2017లో పాదయాత్ర చేసినపుడు ఆయన సీఎం కాలేదు. ఆయన పాలన గురించి ఎవరికీ తెలియదు. ఈసారి ఆయన పాలన మీద ఒక అభిప్రాయం అయితే ఉంది. అయితే జగన్ పాదయాత్రలో పాల్గోనే వర్గాల బట్టి రూట్ మ్యాప్ బట్టి ఆయన ఈసారి టార్గెట్ చేసేది ఏమిటి అన్నది అర్థం అవుతుంది అంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు వైసీపీకి బలంగా ఉంటాయి. అందువల్ల ఆయన పాదయాత్ర ఆ విధంగా డిజైన్ చేస్తారా అన్న చర్చ ఉంది. ఇక ఎన్నికలకు చాలా దూరం ఉంది. గట్టిగా నాలుగేళ్ళ పాటు ఉంది. అందువల్ల జగన్ పాదయాత్ర గురించి ప్రకటించారు కానీ బహుశా అది 2027 చివరిలో ఉండవచ్చు అని అంటున్నారు. అంటే 2029 మేలో జరిగే సార్వత్రిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఉండొచ్చు అని చెబుతున్నారు. పాదయాత్రలో జన సమూహాలతో కలవాలని అనుకుంటుండం వల్లనే ఇప్పటి నుంచే పెద్దగా ప్రజల వద్దకు వెళ్ళడం లేదని చర్చ సాగుతోంది. ఈ రోజునే అందరికీ కలిస్తే ఆనాటికి ఆ ఊపు తగ్గుతుందని వ్యూహంతోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు అని అంటున్నారు. అంతే కాదు జిల్లాల పర్యటనలు కూడా పరిమితంగా చేసుకుంటూ ఈ రెండేళ్ళ పాటు మెల్లగా వైసీపీ రథాన్ని ముందుకు పోనీయాలని కూడా ప్రణాళిక ఉన్నట్లుగా తెలుస్తోంది. ఇక ఏపీలో పాదయాత్రలు ఎపుడూ సక్సెస్ అవుతూనే వచ్చాయి. పాదయాత్ర చేసిన వారికి అధికారం దక్కింది. అది వైఎస్సార్ చంద్రబాబు, జగన్ లోకేష్ ఇలా అందరూ పాదయాత్ర చేసి పదవులు అందుకున్న వారే. దాంతో మరోసారి పాదయాత్ర అని జగన్ అంటున్నారు. మరి ఏపీ రాజకీయాల్లో ఇది ఏ మేరకు ప్రభావం చూపిస్తోందో చూడాలి.

# ఆ బిగ్ లక్కీ హ్యాండ్.. బీజేపీకి కాబోయే జాతీయ అధ్యక్షుడు?




**హైదరాబాద్ పెన్ పవర్:** నితిన్ గడ్కరీ.. రాజ్ నాథ్ సింగ్.. అమిత్ షా.. ఇలా బీజేపీలో అధ్యక్షులుగా అందరు అగ్ర నాయకుల వంతు ముగిసింది.. జేపీ నడ్డా కూడా పొడిగింపుపై ఉన్నారు. వరుసపెట్టి రాష్ట్రాల్లో విజయాలు సాధిస్తూ.. కేంద్రంలోనూ మూడోసారి అధికారంలో కొనసాగుతూ దేశంలో హవా సాగిస్తోంది కమలం పార్టీ. నిజానికి నిరుడు ఈ రోజుల్లోనే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరగాలి. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిగా రాబోయేది ఎవరు? అనే ఆసక్తి నెలకొంది. అదే సమయంలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ఖాయమైందనే కథనాలు వచ్చాయి. కానీ, ఆయన్ను కేంద్రంలో కీలకమైన వ్యవసాయ శాఖకు మంత్రిగా నియమించారు. ఇక ఇప్పుడు మరి కాబోయే అధ్యక్షుడు ఎవరు..?సోమవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల ఎన్నిక పూర్తయింది. మరో నాలుగు రాష్ట్రాలకూ సారథి ఎవరనేది తేలే అవకాశం ఉంది. ఆ పార్టీ రాజ్యాంగం మేరకు జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభానికి ముందే కనీసం 19 రాష్ట్రాల శాఖలకు అధ్యక్షుడిన ఎన్నుకోవాలి. ఇప్పటికి 16 మంది కొత్త అధ్యక్షులు అయ్యారు. మంగళవారం మరో మూడు రాష్ట్రాలకూ ప్రకటించే వీలుంది. ఇక మిగిలింది జాతీయ అధ్యక్షుడి ఎన్నికే. ప్రస్తుతం జేపీ నడ్డా ఆ బాధ్యతల్లో ఉన్నారు. కేంద్ర మంత్రిగానూ విధులు నిర్వర్తిస్తున్నారు. కాబట్టి నడ్డా మళ్లీ కొనసాగడం కష్టమే. చౌహాన్ తో పాటు గడ్కరీ కూడా ఇప్పటికే జాతీయ అధ్యక్ష బాధ్యతలు చూశారు. అందుకని హరియాణా మాజీ సీఎం ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్ తో పాటు భూపేంద్ర యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిలో భూపేంద్రకే ఎక్కువ చాన్స్ ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈయన ఇంచార్జిగా వ్యవహరించిన పలు రాష్ట్రాల్లో బీజేపీ తిరుగులేని విజయం సాధించింది. గత ఏడాది మహారాష్ట్ర ఎన్నికల్లో అఖండ విజయానికి తెరవెనుక సారథి భూపేంద్రనే. యూపీ, రాజస్థాన్, బిహార్ లలో పార్టీ ఎన్నికల బాధ్యుడిగా విజయంలో తనవంతు పాత్ర పోషించారు ఆయన. అందుకనే భూపేంద్ర యాదవ్ నే పార్టీ జాతీయ అధ్యక్షుడు చేస్తారని ఢిల్లీ బీజేపీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి.

భూపేంద్ర వయసు 56 ఏళ్లే. రాజస్థాన్ కు చెందినవారు. కేంద్ర పర్యావరణ, అడవులు, కార్మిక శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

# ఇండియాలో సిరీస్ గెలవాలి.. రిటైర్మెంట్‌పై 556 టెస్ట్ వికెట్ల వీరుడు ఆసక్తికర వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ నాథన్ లియాన్ 37 ఏళ్ళ వయసులో కూడా టెస్ట్ క్రికెట్ లో సత్తా చాటుతూ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మ్యాచ్ ఎక్కడ జరిగినా కూడా ఆసీస్ తుది జట్టులో లియాన్ ఉండాల్సిందే. షేన్ వార్న్ రిటైర్మెంట్ ప్రకటించినప్పటి నుంచి 14 ఏళ్లుగా కంగారూల జట్టు స్పిన్ బాధ్యతలను ఒంటి చేత్తో మోస్తున్నాడు. కెరీర్ లో 138 టెస్టులు.. 556 వికెట్లు.. ఎన్నో మ్యాచ్ విన్నింగ్ ఘనతలు.. ఒక ఆటగాడిగా ఇంతకన్నా ఏం కావాలి. వయసు మీద పడడంతో ఈ ఆసీస్ వెటరన్ స్పిన్నర్ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ఇస్తాడేమో అనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

లియాన్ తాజాగా తన రిటైర్మెంట్ పై వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. 37 ఏళ్ల ఈ అనుభవజ్ఞుడు తన కెరీర్ ముగిసేలోపు ఇంగ్లాండ్, ఇండియాలో సిరీస్ గెలవడంతో పాటు మరో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలవాలనే లక్ష్యాలను పెట్టుకున్నాడు. 2023లో భారత్‌తో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా తొలిసారి డబ్ల్యూటీసీ గెలిచినప్పుడు లియాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. గత నెలలో లార్డ్స్‌లో సౌతాఫ్రికాపై జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓడిపోయింది. లియాన్ మాట్లాడుతూ.. “నేను ఎప్పుడూ ఇండియాలో సిరీస్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటాను. ఇండియాతో పాటు ఇంగ్లాండ్ లోనూ గెలవాలి. కొన్ని సార్లు సిరీస్ గెలిచే అవకాశం వచ్చినా చేజారింది. ప్రతి టెస్ట్ కీలకంగా తీసుకోవాలి. సమ్మర్ లో జరగబోయే యాషెస్ నా ఆలోచనల్లో ఉంది. మరో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఖచ్చితంగా ఆడాలనే లక్ష్యం ఉంది”. అని లియాన్ తన రిటైర్మెంట్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

లియాన్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే 138 టెస్టుల్లో 556 వికెట్లు పడగొట్టాడు. షేన్ వార్న్ (708), ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ (563) తర్వాత ఆస్ట్రేలియన్ బౌలర్ల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. లియాన్ మరో 8 వికెట్లు పడగొడితే మెక్‌గ్రాత్ (563) ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరతాడు. ఓవరాల్ గా లియాన్ టెస్టు క్రికెట్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు.

# వన్డేల్లో నెంబర్ 1, టీ20 ల్లో నెంబర్ 3: టాప్ ఫామ్‌తో దూసుకెళ్తున్న స్మృతి మంధాన





**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా క్రికెట్ లో టీమిండియా ఓపెనర్.. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తన హవా చూపిస్తుంది. ఫార్మాట్ ఏదైనా అత్యుత్తమంగా రాణిస్తుంది. ముఖ్యంగా వన్డే, టీ20 ఫార్మాట్ మంధానకు తిరుగులేకుండా పోతుంది. ఇటీవలే వన్డేల్లో నెంబర్ వన్ ర్యాంక్ కు చేరుకొని చరిత్ర సృష్టించిన ఈ టీమిండియా ఓపెనర్.. తాజాగా ప్రకటించిన మహిళా టీ20 ర్యాంకింగ్స్ లో 771 రేటింగ్ పాయింట్స్ తో మూడో స్థానానికి చేరుకుంది. ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20లో సెంచరీతో చెలరేగింది. 62 బంతుల్లోనే 112 పరుగులు చేసి టీమిండియాకు ఒంటి చేత్తో విజయాన్ని అందించింది. మంధాన ఇన్నింగ్స్ లో 15 ఫోర్లతో పాటు 3 సిక్సర్లు ఉన్నాయి. తొలి టీ20 మ్యాచ్ కు ముందు వరకు నాలుగో స్థానంలో ఉన్న స్మృతి.. సెంచరీతో ఒక స్థానం ఎగబాకింది. ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ 794 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానంలో ఉంది. హేలీ మాథ్యూస్ 774 రేటింగ్స్ తో రెండో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ తో జరగబోయే మిగిలిన నాలుగు మ్యాచ్ ల్లోనూ రాణిస్తే మంధాన టాప్ ర్యాంక్ కు చేరే అవకాశం ఉంది. అదే జరిగితే వన్డే, టీ20 ర్యాంకింగ్స్ లో నెంబర్ ర్యాంక్ సాధించిన ప్లేయర్ గా సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా భారత టీ20 జట్టులో స్థానం సంపాదించిన ఓపెనర్ షఫాలీ వర్మ..టీ20 ర్యాంకింగ్స్ లో 13వ స్థానం నుండి 12వ స్థానానికి ఎగబాకింది. తొలి టీ20లో 22 బంతుల్లో 20 పరుగులు మాత్రమే చేసినప్పటికీ ఆమె ర్యాంక్ మెరుగవ్వడం విశేషం. జూలై 2023లో చివరి టీ20 ఆడి భారత జట్టుకు దూరమైన హర్లీన్ డియోల్ తొలి టీ20లో 23 బంతుల్లో 43 పరుగులు చేసి తిరిగి ర్యాంకింగ్స్ లో ప్రవేశించింది. టీ20 ర్యాంకింగ్స్ లో ఆమె 86 ర్యాంక్ లో నిలిచింది.

# నాలుగున్నర సంవత్సరాల రిలేషన్.. RCB స్టార్ పేసర్‌పై లైంగిక వేధింపుల కేసు





**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఐపీఎల్ ఆడుతూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఫాస్ట్ బౌలర్ యష్ దయాల్ చిక్కుల్లో పడ్డాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ.. దయాల్ తనను మానసికంగా, శారీరకంగా వేధించాడని ఆరోపించింది. దయాల్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు కూడా అధికారిక ఫిర్యాదు అందింది. ఘజియాబాద్‌కు చెందిన బాధితురాలు.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆన్‌లైన్ పోర్టల్‌లో యష్ దయాళ్ అనే క్రికెటర్‌పై ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుల ప్రకారం.. యష్ దయాల్ ఇతర అమ్మాయిలతో కూడా తప్పుడు సంబంధాలలో పాల్గొన్నట్టు ఆరోపించింది.

ఆ మహిళ దయాళ్ తో నాలుగున్నర సంవత్సరాలకు పైగా సంబంధంలో ఉందని చెప్పుకొచ్చింది. ఈ సమయంలో ఈ ఆర్సీబీ ఫాస్ట్ బౌలర్ వివాహ హామీలతో తనను తప్పుదారి పట్టించడమే కాకుండా.. తనను ఊటీకి తీసుకెళ్లి తన నివాసంలో 15 రోజులు ఉండనిచ్చాడని ఆమె ఆరోపించింది. ఆమె తరచుగా అతని ఇంటికి వెళ్లి అతని కుటుంబంతో సమయం గడిపినట్టు తనను పెళ్లి చేసుకుంటానని యష్ దయాల్ హామీ ఇచ్చాడని ఆమె తెలిపింది. యాష్ దయాల్, అతని కుటుంబం వివాహ హామీ ఇవ్వడం ద్వారా ఆమె ఆశలు పెంచుకుంటూనే ఉందని తెలిపింది. అతని వ్యక్తిగత జీవితంలో తాను లోతుగా మునిగిపోయానని కూడా ఆమె అన్నారు. అయితే తాను పెట్టుకున్న ఈ నమ్మకాన్ని వమ్ము చేశాడని.. అదే సమయంలో దయాల్ చాలా మంది మహిళలతో సంబంధం కలిగి ఉన్నాడని ఆ మహిళ చెబుతుంది. ఏప్రిల్ 17, 2025న మరొక మహిళ ఆమెను సంప్రదించి, దయాల్ మోసం చేస్తున్నాడని.. అనేక మంది ఇతర మహిళలతో సంబంధాలు కలిగి ఉన్నాడని రుజువుగా చెప్పిందని తెలిసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం దయాల్‌కు కనీసం ముగ్గురు ఇతర మహిళలతో సంబంధాలు ఉన్నాయనే ఆమె అనుమానాలను వ్యక్తం చేసింది. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2025 లో ఆర్సీబీ తరఫున యష్ దయాల్ 13 వికెట్లు పడగొట్టి జట్టుకు టైటిల్ తీసుకొని రావడంలో కీలక పాత్ర పోషించాడు.




# డిమాండ్ చేయకపోయినా కీర్తి కెరీర్ ఇంకా అలాగే!



హీరోయిన్ గా సక్సెస్ అయితే పారితోషికం పరంగా వాళ్ల డిమాండ్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పని లేదు. హీరోయిన్ అడిగినంత నిర్మాత ఇవ్వాల్సిందే. ఇంకా అదనంగా ఖర్చులు భరించాలి. ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కుపిండి మరీ వసూల్ చేస్తారు. ఈ విషయంలో హీరోయిన్లు అంతా దాదాపు ఒకే తీరున ఉంటారు. హీరోయిన్ల తీరుతో విసిగిన నిర్మాతలెంతో మంది. వచ్చిన ఫిర్యాదులు ఎన్నో ఉన్నాయి. అలాగని అందరూ డబ్బు కోసమే పనిచేసే హీరోయిన్లు కారు. కొంత మంది కథా బలం ఉన్న చిత్రాల మోజులో పారితోషికం గురించి పెద్దగా పట్టించుకోరు. అలాంటి వాళ్లలో కీర్తి సురేష్ ఒకరని తెలుస్తోంది. %-%మహానటి%-% తర్వాత కీర్తి ఎంత పెద్ద స్టార్ అయిందన్నది చెప్పాల్సిన పనిలేదు. నిజంగా ఆనాటి మహాన టిని అభిమానించినట్లే తెలుగు ప్రేక్షకులు కీర్తిని అభిమానించారు. దీంతో తనకంటూ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది.కానీ ఆ క్రేజ్ ను మాత్రం కీర్తి ఏమాత్రం ఎన్ క్యాష్ చేసుకోలేదు అన్నది అంతే వాస్తవం. కీర్తి స్థానంలో మరో నటి ఉంటే? కోట్ల రూపాయలు వెనకేసింది. కానీ కీర్తి మాత్రం ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎందుకలా? అని ప్రశ్నిస్తే తాను కేవలం కథకు..అందులో పాత్రకు మాత్రమే ప్రాధాన్యతి ఇస్తానంది. తాను ఏ సినిమా చేసిన ఆ రెండు చూసే సైన్ చేస్తానంది. పారితోషికం అన్నది చివర్లో డిస్కస్ చేసే అంశంగా చెప్పింది.దీంతో కీర్తి డబ్బు ఉమెన్ కాదని అర్దమవుతుంది. సాధరణంగా ఏ హీరోయిన్ అయినా ముందు పారితోషికం గురించి మాట్లాడుతారు. ఆ తర్వాతే కథ గురించి డిస్కషన్ మొదలవుతుంది. కీర్తి తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా డబ్బుకంటే కథకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుంది. అందుకే వాళ్లకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com